www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

: 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 03 | శుక్రవారం | 1 ఆగస్టు, 2026



## పెద్దికి కన్నీటి వీడ్కోలు

### అధికారిక లాంఛనాలతో నల్లబెల్లిలో అంత్యక్రియలు

ఉద్యమ నేతను కడసారి చూసేందుకు వేలల్లో తరలివచ్చిన అభిమానులు

మాజీ ఎమ్మెల్యేకు చివరిసారి నివాళులర్పించిన నాయకులు

పార్థివదేహంపై బీఆర్ఎస్ జెండా కప్పిన కేటీఆర్

2



తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి శుక్రవారం అధికారిక లాంఛనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. ఈ నెల 26న గుండెపోటుకు గురైన ఆయన హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన మృతితో ఉమ్మడి వరంగల్ జిల్లా, నర్సంపేట నియోజకవర్గంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. హైదరాబాద్ నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో తీసుకొచ్చిన భౌతికకాయానికి హనుమకొండ అమరవీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు.

తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా.
– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా. తెలంగాణే శ్వాసగా.. నీతి, నిజాయితీతో ప్రజా జీవనం కొనసాగిస్తూ సాగించిన ఆయన రాజకీయ ప్రస్థానం అందరికీ ఆదర్శప్రాయం. పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి.
– కేసీఆర్, బీఆర్ఎస్ అధినేత

సహచర తెలంగాణ ఉద్యమకారులు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గారి మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. వారి మరణం తెలంగాణ రాష్ట్రానికి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.
– కల్వకుంట్ల కవిత, టీఆర్ఎస్ అధ్యక్షురాలు

## యువతకు గ్లోబల్ కెరీర్

### టామ్‌కామ్‌కు కొత్త బాధ్యతలు.. పాస్‌పోర్ట్ నుంచి విదేశీ ఉద్యోగం వరకు సమగ్ర సేవలు

- మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలకు సీఎం గ్రీన్‌సిగ్నల్
- విదేశీ భాషలు, డ్రోన్, ఈవీ కోర్సులకు ప్రాధాన్యం
- యువతకు నైపుణ్యాలు, ఉపాధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్ర యువతకు ప్రపంచ స్థాయి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. విదేశీ ఉద్యోగాల కోసం అవసరమైన అన్ని సేవలను ఒకే వేదికపై అందించేలా తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్)ను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పాస్‌పోర్టు నుంచి విదేశీ ఉద్యోగంలో చేరే వరకు అవసరమైన సేవలను సమగ్రంగా అందించడంతో పాటు, అంతర్జాతీయ మ్యాన్‌పవర్ సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుని రాష్ట్ర యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో యువత ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. టామ్‌కామ్‌ను విదేశీ ఉపాధి కల్పనలో కీలక సంస్థగా తీర్చిదిద్దాలని, ఇందుకోసం అంతర్జాతీయ మ్యాన్‌పవర్ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకునేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలను నమోదు చేసే సమగ్ర డేటా వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. టామ్‌కామ్‌కు అనుభవజ్ఞుడైన మాజీ భారత విదేశాంగ సేవ అధికారిని ముఖ్య కార్యనిర్వాహక అధికారిగా నియమించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. విదేశీ ఉద్యోగాలకు అవసరమైన డ్రైవింగ్, సాంకేతిక నైపుణ్యాలు, వృత్తి శిక్షణలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అందించాలని సూచించారు.

#### విదేశీ భాషల బోధనకు ప్రత్యేక విభాగాలు

ప్రపంచ ఉద్యోగ విపణిలో పోటీ పడేలా యువతకు విదేశీ భాషలపై ప్రత్యేక శిక్షణ కల్పించాలని సీఎం ఆదేశించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు జర్మన్, జపనీస్, కొరియన్ తదితర విదేశీ భాషల బోధనకు ప్రత్యేక విభాగాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నూతన సాంకేతికతలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించాలని తరువాయి 2లో..



సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



### నాంపల్లి కోర్టుకు కేటీఆర్

- ఫార్ములా–ఈ కేసులో ప్రారంభమైన విచారణ
- చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం
- రూ.లక్ష పూచీకత్తుతో పాటు ఇద్దరు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 25కు వాయిదా

2




### కార్మికుల గళంగా టీఆర్‌టీయూ

- తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్‌కు శ్రీకారం చుట్టిన టీఆర్ఎస్
- శ్రమ దోపిడీని అడ్డుకుంటాం
- కార్మికులు, ఉద్యోగులు, టీచర్లకు అండగా నిలుస్తాం
- కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి
- పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత
- కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్

3

### ఆప్ నేత తాహిర్‌కు యావజ్జీవం

- ఐబీ అధికారి అంకిత్ శర్మ హత్యకేసులో ఢిల్లీ కోర్టు కీలక తీర్పు
- దారుణ హత్యగా వ్యాఖ్యానించిన న్యాయస్థానం

2

## ప్రాజెక్టుల పరవళ్లు

### ఎడతెరిపిలేని వర్షాలతో జలకళను సంతరించుకున్న జలాశయాలు

### నిండుకుండల్లా శ్రీరాంసాగర్, జూరాల, ఎల్లంపల్లి

- జూరాల గేట్ల ద్వారా భారీగా నీటి విడుదల
- భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరిన గోదావరి
- తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు
- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం



భద్రాచలం వద్ద శుక్రవారం ఉదయం 10.30 గంటలకు గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరిన నీటిమట్టం

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో తెలంగాణలోని ప్రధాన జలాశయాలు వరద జలాతో కళకళలాడుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతుండడంతో శ్రీరాంసాగర్, ప్రియదర్శిని జూరాల, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు వేగంగా నిండుతున్నాయి. మరోవైపు గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తూ భద్రాచలం వద్ద ప్రమాద స్థాయికి చేరుకుంది. దీంతో అధికారులు తొలి ప్రమాద హెచ్చరిక జారీచేసి నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు ప్రాంతాల్లో వరద నీరు రహదారులపైకి చేరడంతో రాకపోకలు స్తంభించాయి.

2

### 'ఇందిరమ్మ టవర్స్'కు గ్రీన్‌సిగ్నల్

#### ఆగస్టు చివరి వారంలో శంకుస్థాపన



- మొదటి విడతలో 16 నియోజకవర్గాల్లో నిర్మాణాలు
- త్వరలో టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- దరఖాస్తులకు ఈ నెల 10 చివరి తేదీ
- పొడగింపునకు ఎలాంటి అవకాశం లేదు
- ఇల్లు రాకపోతే ఈఎండీ పూర్తి రీఫండ్
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2

### సర్‌కు మరో వారం గడువు

- ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించనున్న బీఎల్వోలు

2



### కుటుంబ ధ్రువీకరణకు 'ఫ్యామిలీ సర్టిఫికెట్'

- తెలంగాణలో కొత్త సేవకు శ్రీకారం
- తహశీల్దార్, మీ సేవ కేంద్రాల ద్వారా జారీ
- ప్రభుత్వ పథకాలు, అధికారిక అవసరాలకు చెల్లుబాటు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

# పెద్దికి కన్నీటి వీడ్కోలు

- అధికారిక లాంఛనాలతో నల్లబెల్లిలో అంత్యక్రియలు
- ఉద్యమ నేతను కడసారి చూసేందుకు వేలల్లో తరలివచ్చిన అభిమానులు
- మాజీ ఎమ్మెల్యేకు చివరిసారి నివాళులర్పించిన నాయకులు
- పార్థివదేహంపై బీఆర్ఎస్ జెండా కప్పిన కేటీఆర్



**ప్రజానావ, వరంగల్ బ్యూరో:** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి శుక్రవారం అధికారిక లాంఛనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. ఈ నెల 26న గుండెపోటుకు గురైన ఆయన హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన మృతితో ఉమ్మడి వరంగల్ జిల్లా, నర్సంపేట నియోజకవర్గం లో విషాద ఛాయలు అలుముకున్నాయి. హైదరా బాద్ నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో తీసుకొచ్చిన భౌతికకాయానికి హనుమకొండ అమరవీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. అనంతరం వరంగల్, నర్సంపేట మీదుగా స్వగ్రామమైన నల్లబెల్లి వరకు భారీ అంతిమయాత్ర నిర్వహించారు. దారిపొడవునా ప్రజలు, పార్టీ కార్యకర్తలు పూలమాలలు సమర్పిస్తూ 'పెద్ది సుదర్శన్‌రెడ్డి అమర్ హై' అంటూ నినాదాలు చేశారు. వేలాది వాహనాలతో సాగిన ర్యాలీతో ప్రధాన రహదారులు జనసంద్రంగా మారగా, పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నల్లబెల్లిలోని నివాసానికి భౌతికకాయం చేరుకోగానే కుటుంబ సభ్యులు, అభిమానులు కన్నీరుమున్నీరయ్యారు. భారీ వర్షం కురిసినా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వెనుదిరగకుండా నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. బీఆర్ఎస్ జెండాను కప్పి పార్టీ తరపున ఘనంగా నివాళులర్పించారు.

### నర్సంపేట బంద్

నర్సంపేటలో వ్యాపార, వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించి పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపాయి. అంతిమయాత్ర సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి నల్లబెల్లిలోని ఆయన వ్యవసాయక్షేత్రంలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వం తరఫున ఆర్డీవో ఉమా రాణి నివాళులర్పించగా, పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు పాడె మోసి తమ ఉద్యమ సహచరుడికి తుది వీడ్కోలు పలికారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజా జీవితం, తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మంత్రి సీతక్క, కేంద్ర మంత్రి బండి సంజయ్, సహా పలువురు నేతలు సంతాప సందేశాల్లో పేర్కొన్నారు. ఆయన మరణం తెలంగాణ రాజకీయాలకు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని అభివర్ణించారు.

# ప్రాజెక్టుల పరవళ్లు

## ఎడతెరిపిలేని వర్షాలతో జలకళను సంతరించుకున్న జలాశయాలు

- నిండుకుండల్లా శ్రీరాంసాగర్, జూరాల, ఎల్లంపల్లి
- జూరాల గేట్ల ద్వారా భారీగా నీటి విడుదల
- భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరిన గోదావరి
- తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు
- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో తెలంగాణలోని ప్రధాన జలాశయాలు వరద జలాలతో కళకళలాడుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతుండటంతో శ్రీరాంసాగర్, ప్రియదర్శిని జూరాల, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు వేగంగా నిండుతున్నాయి. మరోవైపు గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తూ భద్రాచలం వద్ద ప్రమాద స్థాయికి చేరుకుంది. దీంతో అధికారులు తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేసి నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు ప్రాంతాల్లో వరద నీరు రహదారులపైకి చేరడంతో రాకపోకలు స్తంభించాయి. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుతం 74,950 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు కాగా ప్రస్తుతం నీటిమట్టం 1,069.20 అడుగులకు చేరింది. 80.50 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికి గాను 21.70 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులోకి 1,46,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని అధికారులు 28 గేట్లు ఎత్తి 1,33,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు కడెం ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరద నీరు చేరుతోంది. ప్రస్తుతం 1,21,354 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 15 గేట్ల ద్వారా 1,08,493 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 20.175 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 18.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

### ఉగ్ర గోదావరి

గోదావరి నదిలో వరద ఉధృతి రోజురోజుకూ పెరుగుతోంది. భద్రాచలం వద్ద శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నీటిమట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కల్యాణకట్ట, స్నాన ఘట్టాలు వరద నీటిలో మునిగిపోగా, ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ములుగు జిల్లాలో కూడా వరద ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. మేడిగడ్డ నుంచి 8.35 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం సమ్మక్క బ్యారేజీకి చేరుతుండటంతో అధికారులు 59 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వాజేడు మండలం టేకులగూడెం వద్ద రహదారిపై వరద నీరు ప్రవహించడంతో తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే వెంకటాపురం మండలం బోదాపురం వంతెనపైకి వరద నీరు చేరడంతో వెంకటాపురం–భద్రాచలం మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అవసరమైతే తప్ప వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లవద్దని అధికారులు ప్రజలకు సూచించారు.

# భోగాపురంతో ఏపీకి అభివృద్ధి రన్‌వే

## ధింసా నృత్యానికి గిన్నిస్ వరల్డ్ రికార్డు

**ప్రజానావ, విశాఖపట్నం:** ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వంలో భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి, ప్రగతి దిశగా కొత్త రన్‌వేపై నిలబెట్టిందని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో సుమారు రూ.5,000 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ అంతర్జాతీయ విమానా శ్రయాన్ని శనివారం ప్రధాని మోదీ ప్రారంభించ నున్నారు. ప్రధానమంత్రి మోదీకి స్వాగతం పలుకుతూ చంద్రబాబు ఎక్స్‌లో చేసిన పోస్టులో, ఈ ప్రపంచస్థాయి విమానయాన కేంద్రం ఎన్డీయే ప్రభుత్వాల సమష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నా రు. ఉత్తరాంధ్ర ప్రజల ఆశయాలకు ఇది కొత్త అవకాశాల ద్వారాలు తెరుస్తుందన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవడంతో పాటు రాష్ట్ర విమానయాన రంగానికి కొత్త శకానికి నాంది పలుకుతుందని తెలిపారు. భవిష్యత్తులో దీనిని ఏవియేషన్, ఏరోస్పేస్ హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

### ప్రారంభోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ట్రాఫిక్, పార్కింగ్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించింది. కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతృప్తిగా తిరిగి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు 10 వేల మందికి పైగా గిరిజన మహిళలు సంప్రదాయ ధింసా నృత్యం ప్రదర్శించను న్నారు. ఉత్తరాంధ్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబిం బించేలా ఏటికొప్పాక బొమ్మలు, బొబ్బిలి వీణ, తోలు బొమ్మల ప్రదర్శనలతో విమానాశ్రయాన్ని అలంకరించారు. ఇదే సందర్భంగా నిర్వహించిన అతిపెద్ద ధింసా నృత్య ప్రదర్శన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది.

# వర్షాలకు విరామం?

- ఆగస్టు – సెప్టెంబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం
- 94 శాతం లోపే నమోదయ్యే అవకాశం
- ఐఎండీ అంచనా.. ఎల్‌పీఏ ఆధారంగా వర్షాల లెక్కింపు

**న్యూఢిల్లీ:** నైరుతి రుతుపవనాల రెండో అర్ధభాగంలో (ఆగస్టు–సెప్టెంబర్) దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. శుక్రవారం విడుదల చేసిన నెలవారీ వర్షపాత అంచనాల్లో ఈ విషయాన్ని పేర్కొంది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దేశవ్యాప్తంగా కురిసే వర్షపాతం దీర్ఘకాల సగటు (లాంగ్ పీరియడ్ యావరేజ్–ఎల్‌పీఏ)లో 94 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

### ఎల్‌పీఏ అంటే ఏమిటి?

ఒక ప్రాంతంలో నిర్దిష్ట కాల వ్యవధిలో (నెల లేదా సీజన్) నమోదయ్యే వర్షపాతాన్ని సుదీర్ఘ కాలం పాటు సగటు తీసుకుంటే దానిని దీర్ఘకాల సగటు (ఎల్‌పీఏ)గా పరిగణిస్తారు. సాధారణంగా 30 నుంచి 50 ఏళ్ల వర్షపాత గణాంకాల ఆధారంగా దీనిని లెక్కిస్తారు. ఈ ఎల్‌పీఏ ప్రమాణంతోనే వర్షపాతం సాధారణ స్థాయిలో ఉందా, అధికంగా నమోదైందా లేదా లోటుగా ఉందా అనే విషయాన్ని ఐఎండీ అంచనా వేస్తుంది.

# విదేశీ విద్యార్థులపై ట్రంప్ ఫీజు బాంబ్

- ఓపీటీ వీసాలకు లక్ష డాలర్ల వసూలు యోచన
- హెచ్–1బీ తర్వాత విద్యార్థి వీసాలపైనా కఠిన వైఖరి
- వలస విధానంలో మరిన్ని మార్పులపై కసరత్తు



**వాషింగ్టన్:** అమెరికాలో ఉన్నత విద్య పూర్తి చేసిన విదేశీ విద్యార్థులు అక్కడే ఉద్యోగాలు చేసుకునేందుకు ఉపయోగించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) వీసాలపై భారీ ఫీజు విధించే ప్రతిపాదనను ట్రంప్ ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఓపీటీ వీసాలపై 1,00,000 అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.8 కోట్లకు పైగా) ఫీజు విధించే అంశంపై అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ (డీహెచ్ఎస్) కసరత్తు చేస్తున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. హెచ్–1బీ వీసాలపై 1,00,000 డాలర్ల ఫీజు విధించే ప్రతిపాదనను అమెరికా కోర్టు తాత్కాలికంగా నిలిపివేసిన నేపథ్యంలో ట్రంప్ యంత్రాంగం ఇప్పుడు ఓపీటీ వీసాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

### హెచ్–1బీ, గ్రీన్ కార్డులపైనా మార్పుల యోచన

హెచ్–1బీ వీసాలపై భారీ ఫీజు విధించే ప్రతిపాదనను అమెరికా టెక్ కంపెనీలు వ్యతిరేకించాయి. ఇదే సమయంలో హెచ్–1బీ, విద్యార్థి వీసాలతో పాటు విదేశాల నుంచి గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారిపై కూడా 1,00,000 డాలర్ల బాండ్ విధించే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ బాండ్ అమెరికాకు చేరుకున్న తర్వాత, భవిష్యత్తులో పౌరసత్వం పొందిన అనంతరం మాత్రమే తిరిగి చెల్లించే విధంగా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ఓపీటీ వీసాలపై ఫీజు ప్రతిపాదనకు సంబంధించి ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని డీహెచ్ఎస్ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. అధికారిక ప్రకటన వెలువడే వరకు ఏ ప్రతిపాదనను విధాన నిర్ణయంగా పరిగణించలేమని తెలిపారు. చట్టబద్ధమైన వలస విధాన వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించే అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించడంలో ఓపీటీ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోంది. ఈ విధానంలో మార్పులు వస్తే చదువు పూర్తయిన తర్వాత అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే వేలాది మంది విదేశీ విద్యార్థులపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

> **చదువు తర్వాత ఉద్యోగాలకు అవకాశం**
>
> అమెరికా విశ్వవిద్యాలయాల్లో చదివే విదేశీ విద్యార్థులకు ఎఫ్–1 విద్యార్థి వీసాకు పొడిగింపుగా ఓపీటీ వీసాలను జారీ చేస్తారు. ఈ విధానం ద్వారా విద్యార్థులు తమ విద్యకు సంబంధించిన రంగాల్లో ఒకటి నుంచి మూడు సంవత్సరాల వరకు అమెరికాలో ఉద్యోగం చేసే అవకాశం ఉంటుంది. 2024 గణాంకాల ప్రకారం, ఓపీటీ కార్యక్రమం కింద దాదాపు 4.19 లక్షల మంది విదేశీయులు అమెరికాలో పనిచేస్తున్నారు. ముఖ్యంగా సాంకేతిక రంగ సంస్థలు అమెరికా విశ్వవిద్యాలయాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను నియమించుకుంటున్నాయి.

# సర్‌కు మరో వారం గడువు

- ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించనున్న బీఎల్వోలు
- ఆగస్టు 17న ముసాయిదా జాబితా, అక్టోబర్ 19న తుది జాబితా
- రాష్ట్రంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పురోగతిని సమీక్షించిన ఈసీఐ అధికారులు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి గడువు పొడిగించింది. ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఆగస్టు 10 వరకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. తొలుత జూలై 24 వరకు ఉన్న గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన ఎన్నికల సంఘం, తాజాగా మరో వారం రోజుల పాటు గడువు పెంచింది. ఓటర్ల వివరాల సేకరణ కోసం బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికీ వెళ్లి సమాచారం నమోదు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను ఆగస్టు 10లోగా బీఎల్‌వోలకు అందజేయాలని సూచించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. అదే రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిములు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు వాటిని పరిశీలించి పరిష్కరించనున్నారు. తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19న ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

### ఇప్పటివరకు 77.12 శాతం పూర్తి

ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. హైదరాబాద్ జిల్లాలో 56.31 శాతం, రంగారెడ్డి జిల్లాలో 63.43 శాతం, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 61.37 శాతం నమోదు పూర్తయినట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా, కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ తెలంగాణలో పర్యటించి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఆయనకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ. సుదర్శన్‌రెడ్డి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రంలో ఎస్ఐఆర్ అమలు తీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించిన నవీన్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశమై పురోగతిపై ఆరా తీశారు.

# 'ఇందిరమ్మ టవర్స్'కు గ్రీన్‌సిగ్నల్

- ఆగస్టు చివరి వారంలో శంకుస్థాపన
- మొదటి విడతలో 16 నియోజకవర్గాల్లో నిర్మాణాలు
- త్వరలో టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- దరఖాస్తులకు ఈ నెల 10 చివరి తేదీ
- పొడగింపునకు ఎలాంటి అవకాశం లేదు
- ఇల్లు రాకపోతే ఈఎండీ పూర్తి రీఫండ్
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలోని పేదలకు నగరాల్లో అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో నాణ్యమైన, గౌరవప్రదమైన గృహాలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఆగస్టు చివరి వారంలో శంకుస్థాపన నిర్వహించనున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. టెండర్ల ప్రక్రియను ఈ నెలలోనే ప్రారంభించి, పనులను వేగంగా చేపట్టనున్నట్లు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి, తొలి విడతలో రాష్ట్రంలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ తుది దశకు చేరుకుందని, రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ టవర్స్‌లో గృహాల కోసం దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 10 చివరి తేదీగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఆ తర్వాత ఎలాంటి పొడగింపు ఉండదని స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ వంటి గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి గృహం కేటాయించని పక్షంలో చెల్లించిన రూ.10 వేల ఈఎండీ మొత్తాన్ని వంద శాతం తిరిగి చెల్లిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించిన వారి బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా రీఫండ్ జమ చేస్తామని వివరించారు.

### ఫలక్‌నుమా ప్యాలెస్ పరిసరాల్లోనూ నిర్మాణం

ఇందిరమ్మ టవర్స్‌లోని ప్రతి ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని, లబ్ధిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఫలక్‌నుమా ప్యాలెస్ పరిసరాల్లో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. నగరాల్లో అన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన శాశ్వత గృహాలను పేదలకు అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

# నాంపల్లి ఏసీబీ కోర్టుకు కేటీఆర్

- ఫార్ములా–ఈ కేసులో ప్రారంభమైన విచారణ
- తదుపరి విచారణ ఈ నెల 25కు వాయిదా

**ప్రజానావ, హైదరాబాద్:** ఫార్ములా–ఈ రేసు వ్యవహారానికి సంబంధించిన కేసులో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కేసులో భాగంగా శుక్రవారం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. కోర్టు జారీ చేసిన సమన్ల మేరకు ఆయన తొలిసారిగా విచారణకు హాజరుకాగా, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి కూడా కోర్టు ఎదుట హాజరయ్యారు. ఈ కేసులో ఇప్పటికే ఏసీబీ అధికారులు చార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఫార్ములా–ఈ రేసు నిర్వహణలో జరిగిన అవకతవకల కారణంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)కు రూ.54.88 కోట్ల నష్టం వాటిల్లిందని చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఈఈఎక్స్ కంపెనీని నిందితులుగా చేర్చారు. చార్జ్‌షీట్‌ను పరిశీలించిన ఏసీబీ కోర్టు దానిని పరిగణనలోకి తీసుకున్నట్లు వెల్లడించింది. తదుపరి దశలో కేసు విచారణ (ట్రయల్)ను ప్రారంభించనున్నట్లు పేర్కొంది. విచారణ సందర్భంగా కేటీఆర్ లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఇద్దరు షూరిటీలను సమర్పించాలని కోర్టు ఆదేశించింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఆగస్టు 25కు వాయిదా వేసింది.

# ఆప్ నేత తాహిర్‌కు యావజ్జీవం

- ఐబీ అధికారి అంకిత్ శర్మ హత్యలో ఢిల్లీ కోర్టు కీలక తీర్పు
- దారుణ హత్యగా వ్యాఖ్యానించిన న్యాయస్థానం

**న్యూఢిల్లీ:** 2020 ఢిల్లీ అల్లర్ల సందర్భంగా ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ నేత తాహిర్ హుస్సేన్‌కు ఢిల్లీ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. హత్య అత్యంత దారుణంగా జరిగిందని పేర్కొన్న న్యాయస్థానం, నేర తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ శిక్షను ఖరారు చేసింది. అంకిత్ శర్మపై అమానుషంగా దాడి చేసి హత్య చేసిన అనంతరం ఆయన మృతదేహాన్ని ఈడ్చుకెళ్లి కాలువలో పడేశారని కోర్టు వ్యాఖ్యానించింది. నేరం జరిగిన తీరు చూస్తే హత్య తర్వాత కూడా మృతుడిపై ద్వేషం చల్లారలేదనే విషయం స్పష్టమవుతోందని న్యాయమూర్తి పేర్కొన్నారు. అయితే, ఈ ఘటన మూకదాడి నేపథ్యంలో చోటుచేసుకోవడం, ఆ సమయంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న తప్పుడు సమాచార ప్రభావం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్న తర్వాతే యావజ్జీవ శిక్షను విధించినట్లు కోర్టు వెల్లడించింది. 2020 ఫిబ్రవరిలో జరిగిన ఢిల్లీ అల్లర్ల సమయంలో అంకిత్ శర్మపై కత్తులు, ఇనుపరాడ్లు, రాళ్లతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం ఆయన మృతదేహాన్ని సమీపంలోని కాలువలో పడేశారు. మరుసటి రోజు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, శరీరంపై 54 కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. దర్యాప్తులో ఈ హత్యలో తాహిర్ హుస్సేన్ ప్రమేయం ఉన్నట్లు తేలడంతో ఆయనపై అభియోగాలు నమోదు చేశారు.

### హైకోర్టులో సవాలు చేస్తాం

తీర్పుపై స్పందించిన తాహిర్ హుస్సేన్ తరఫు న్యాయవాది, ఈ నిర్ణయాన్ని ఢిల్లీ హైకోర్టులో సవాలు చేస్తామని తెలిపారు. తనకు న్యాయం ఆలస్యమైనా తప్పకుండా లభిస్తుందనే నమ్మకం ఉందని తాహిర్ పేర్కొన్నాడు. మరోవైపు ఢిల్లీ న్యాయశాఖ మంత్రి కపిల్ మిశ్రా ఈ తీర్పును స్వాగతించారు. అంకిత్ శర్మ హత్య కేసులో న్యాయం జరిగే దిశగా ఇది తొలి అడుగని పేర్కొన్నారు. హత్య జరిగిన తీరు దృష్ట్యా నిందితులకు మరణశిక్షే సముచితమని అభిప్రాయపడుతూ, హైకోర్టులో తాహిర్‌కు మరణశిక్ష విధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కుటుంబ ధ్రువీకరణకు 'ఫ్యామిలీ సర్టిఫికెట్'

- తెలంగాణలో కొత్త సేవకు శ్రీకారం
- తహశీల్దార్, మీ సేవ కేంద్రాల ద్వారా జారీ
- ప్రభుత్వ పథకాలు, అధికారిక అవసరాలకు చెల్లుబాటు
- ప్రజలకు మరింత సులభతరం కానున్న కుటుంబ వివరాల ధ్రువీకరణ
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మరో కీలక సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియను ప్రారంభించినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇకపై కుటుంబ సభ్యుల పూర్తి వివరాలతో కూడిన అధికారిక ఫ్యామిలీ ధ్రువపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల ద్వారా సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ ధ్రువపత్రం ద్వారా కుటుంబ వివరాలను అధికారికంగా ధ్రువీకరించుకునే అవకాశం కలుగుతుందని, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, అధికారిక ధ్రువీకరణలు, కుటుంబ వివరాలను సమర్పించాల్సిన సందర్భాల్లో ఇది ఎంతో ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఫ్యామిలీ సర్టిఫికెట్‌కు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో చెల్లుబాటు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు కుటుంబ సభ్యుల వివరాల ధ్రువీకరణ కోసం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, పారదర్శకంగా, వేగంగా సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ప్రజలు తమకు అవసరమైన సమయంలో సమీప తహశీల్దార్ కార్యాలయం లేదా మీ సేవ కేంద్రాన్ని సంప్రదించి ఫ్యామిలీ సర్టిఫికెట్‌ను పొందాలని, ప్రభుత్వం అందిస్తున్న ఈ కొత్త సేవను సద్వినియోగం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు.

# యువతకు గ్లోబల్ కెరీర్

(మొదటిపేజీ తరువాయి)

సూచించిన సీఎం, అడ్వాన్స్ టె క్నాలజీ సెంటర్లలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులను ప్రారంభించాలని ఆదేశించారు. బ్లూ కాలర్ ఉద్యోగాలకు శిక్షణ పొందే యువతకు స్కాలర్‌షిప్‌లు కల్పించే అవకాశాలను పరిశీలించాలని, అలాగే ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు పరిశ్రమల్లో నాణ్యమైన ఇంటర్న్‌షిప్‌లు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

### నర్సింగ్ కళాశాలల ఏర్పాటు

ప్రపంచవ్యాప్తంగా నర్సింగ్ రంగంలో పెరుగుతున్న అవకాశాల ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో కొత్త నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. నైపుణ్యాభి వృద్ధి, విదేశీ ఉపాధి, ఆధునిక సాంకేతిక విద్య ద్వారా తెలంగాణ యువతను ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేయడమే ప్రభు త్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత శాఖ మంత్రి వివేక్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు ఈసీకి ప్రతిపాదనలు

- ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ..
- రాజకీయ పార్టీల సహకారం కోరిన కలెక్టర్ చంద్రశేఖర్

ప్రజానావ, నల్లగొండ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించిన ప్రతిపాదనలను ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల్లో నమోదైన తప్పులు, మరణించిన ఓటర్లు, శాశ్వతంగా చిరునామా మార్చుకున్న వారు, వివిధ కారణాలతో ఫారాలు సమర్పించని వారి వివరాలను సరిచేసేందుకు శని, ఆదివారాల్లో బీఎల్‌వోలకు ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశాలకు బీఎల్ఏలంతా తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. జిల్లాలో ప్రస్తుతం 1,812 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 30 కేంద్రాల లొకేషన్ మార్పుకు, ఎనిమిది కేంద్రాల పేర్ల మార్పుకు, మరో 42 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు. వీటన్నింటినీ ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ముంతాజ్ అలీ, బీజేపీ నుంచి లింగస్వామి, బీఆర్ఎస్ నుంచి పిచ్చయ్య, సీపీఎం నుంచి నర్సిరెడ్డి, టీడీపీ నుంచి తేలు అన్న రవి, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఎస్‌కే ఆర్ అన్సారీ, ఎన్సీపీ నుంచి రఫీక్, ఎఐఎంఐఎం నుంచి ఖాజా గౌస్ మొయినుద్దీన్, ఎన్నికల సంఘం పర్యవేక్షకులు కృష్ణమూర్తి, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల గళంగా టీఆర్‌టీయూ

- తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్‌కు శ్రీకారం చుట్టిన టీఆర్ఎస్ పార్టీ
- శ్రమ దోపిడీని అడ్డుకుంటాం
- కార్మికులు, ఉద్యోగులు, టీచర్లకు అండగా నిలుస్తాం
- కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్




ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ (టీఆర్‌టీయూ)ను ఏర్పాటు చేస్తున్నట్లు టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. శ్రమజీవుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు శ్రమ దోపిడీని అడ్డుకోవడమే టీఆర్‌టీయూ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ ట్రేడ్ యూనియన్ లోగోను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె ఈ విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం టీఆర్‌టీయూ నిరంతరం పోరాటం చేస్తుందని, వారి హక్కుల పరిరక్షణలో అండగా నిలుస్తుందని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మిక హిత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి శ్రమజీవుల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. దేశంలో కార్మిక చట్టాలు, ట్రేడ్ యూనియన్ల హక్కులను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆమె, కార్మికుల హక్కుల పరిరక్షణకు ట్రేడ్ యూనియన్లు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శ్రమజీవులకు గౌరవప్రదమైన, సురక్షితమైన పని వాతావరణం కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుతం అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసనలకు దిగాల్సిన పరిస్థితి నెలకొందని, కార్మికుల శ్రమను ప్రభుత్వాలే దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కాకుండా కార్మికులు, ఉద్యోగులు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ కోడ్‌లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కవిత తెలిపారు. ఈ కోడ్‌ల అమలుతో కార్మికుల హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు తరహాలో తెలంగాణలో కూడా వాటిని అమలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కనీస వేతనాన్ని రూ.26 వేలుకు పెంచాలని టీఆర్‌టీయూ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గతంలో రూ.20 వేల కనీస వేతనం కోరిన వారు ఇప్పుడు రూ.16 వేల ప్రతిపాదన చేయడం సమంజసం కాదని విమర్శించారు.

## ఐటీ ఉద్యోగులకూ భద్రత కల్పించాల్సిందే

ఐటీ, ఫార్మా రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆయా రంగాల్లో ట్రేడ్ యూనియన్ల ఏర్పాటుకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల జీనోమ్ వ్యాలీలో ఉద్యోగుల తొలగింపులను ప్రస్తావిస్తూ, ప్రైవేట్ రంగంలో యూనియన్లు లేకపోవడం వల్ల ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ రంగ సిబ్బంది, ఉపాధ్యాయులు భద్రతతో, గౌరవంగా పనిచేసే పరిస్థితులు ఏర్పడినప్పుడే రాష్ట్రం, దేశం సమగ్ర అభివృద్ధి సాధిస్తాయని కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ కార్మికుల హక్కుల సాధనలో ఉద్యమ వేదికగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.



# శాకాంబరి అలంకరణలో అమ్మవారు

## ప్రేమ్‌నగర్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ప్రజానావ, ఖైరతాబాద్: ఆషాఢమాసం సందర్భంగా ప్రేమ్‌నగర్‌లోని శ్రీమాత ఎల్లమ్మ, శ్రీమాత నల్లపోచమ్మ, శ్రీ కట్టమైసమ్మ దేవాలయాల్లో శుక్రవారం శాకాంబరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలు, పండ్లతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రేమ్‌నగర్ బస్తీ పంచాయతీ కమిటీ అధ్యక్షుడు జి. రామచందర్ మాట్లాడుతూ, ఆగస్టు 9న జరిగే అమ్మవారి బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాసరి విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి కె. భగవాన్‌దాస్, ఉపాధ్యక్షుడు జి. సుధీర్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఎ. విజయ్‌కుమార్, జి. జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సమర్థ దర్యాప్తు వేగవంతమైన విచారణతో సత్ఫలితాలు సాధిస్తున్న జిల్లా పోలీసులు

- గడిచిన ఆరు నెలల కాలంలో 44 కేసులలో 66 మంది నిందితులకు జైలు శిక్షలు
- ఐదు హత్య కేసులలో 19 మందికి యావజ్జీవ కారాగార (జీవిత ఖైదు) శిక్షలు
- నిందితులకు శిక్ష పడటంలో విశేష కృషి చేస్తున్న అధికారులకు, సిబ్బందికి ప్రసంశలు, ప్రోత్సాహకాలు
- జిల్లా ఎస్పీ మహేష్ బీ. గితే



ప్రజానావ, సిరిసిల్ల : సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్ఠమైన సాక్ష్యాధారాల సేకరణ, వేగవంతమైన విచారణతో నిందితులకు శిక్షలు పడేలా జిల్లా పోలీసులు విశేష ఫలితాలు సాధిస్తున్నారని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పలు కేసుల్లో నిందితులకు శిక్షల పడేలా కృషి చేసిన అధికారులకు, సిబ్బందిని అభినందించి ప్రశంస పత్రాలు, ప్రోత్సాహకాలు అందజేశారు.

## కోర్టులు విధించిన శిక్షల వివరాలు

ఐదు హత్య కేసుల్లో 19 మంది నిందితులకు యావజ్జీవ కారాగార (జీవిత ఖైదు) శిక్షలు, మూడు కేసుల్లో నిందితులకు 20 సంవత్సరాల జైలు శిక్ష, రెండు కేసుల్లో నిందితులకు10 సంవత్సరాల జైలు శిక్ష, ఏడు కేసుల్లో నిందితులకు 3 నుండి 5 సంవత్సరాల జైలు శిక్ష, 17 కేసుల్లో నిందితులకు1 నుండి 3 సంవత్సరాల జైలు శిక్ష,10 కేసుల్లో నిందితులకు ఒక సంవత్సరం లోపు జైలు శిక్షలు, మొత్తంగా గత ఆరు నెలల కాలంలో 44 కేసుల్లో 66 మంది నిందితులకు జైలు శిక్షలు విధించబడగా, అందులో ఐదు హత్య కేసుల్లో 19 మంది నిందితులకు జీవిత ఖైదు విధించడం విశేషమని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ... నిందితులకు శిక్షలు పడటంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర అత్యంత కీలకమని, పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేలా కృషి చేయాలని సూచించారు. గడచిన ఆరు నెలల కాలంలో పలు క్రిమినల్ కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలు విధించాయని, ముఖ్యంగా హత్య, పోక్సో, హత్యాయత్నం, దోపిడీ, చోరీ తదితర కేసుల్లో పకడ్బందీగా త్వరగతిన దర్యాప్తు నిర్వహించి, సాక్ష్యాలను కోర్టులో సమర్పించడం వల్ల శిక్షల శాతం పెరిగాయని, ఇదే ఉత్సాహంతో ప్రతి ఒక్కరు పని చేయాలని సూచించారు. పోలీసు అధికారులు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రతి కేసును బాధ్యతాయుతంగా విచారించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం దర్యాప్తులో అత్యంత కీలకమైందని, ప్రతి కేసులో శాస్త్రీయ ఆధారాలను తప్పనిసరిగా సేకరించి కోర్టులో సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, కోర్టు మానిటరింగ్ ఎస్ఐలు రవీంద్రనాయుడు, శ్రావణ్ యాదవ్, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



# శాకాంబరి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

- శ్రీరామ్‌నగర్ సీతారామస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధల మధ్య వేడుకలు
- ఉత్సవాల్లో పాల్గొన్న యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్

ప్రజానావ, శేరిలింగంపల్లి: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని శేర్లింగం పల్లి శ్రీరామ్‌నగర్ కాలనీలోని శ్రీ సీతారామస్వామి దేవాలయంలో శాకాంబరి ఉత్సవాలను భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రఘునాథ్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆలయ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో కమిటీ చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బలరామ్ యాదవ్, రాజమోహన్ రావు, ఓబుల్‌రెడ్డి, నాగరాజు యాదవ్, వెంకటేశ్వర్లు, వెంకటరామయ్య, అనంతరెడ్డి, సన్నీ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# హైవేపై మహిళల భద్రతకు 'షీ సేఫ్ జోన్'

- సురక్షిత ప్రయాణానికి సిద్దిపేట పోలీసుల వినూత్న చర్య..
- నెల రోజుల్లో ప్రత్యేక భద్రతా కేంద్రాల ఏర్పాటు

ప్రజానావ, సిద్దిపేట: రాజీవ్ రహదారిపై ప్రయాణించే మహిళలు, కుటుంబాలకు మరింత భద్రత కల్పించేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఆధ్వర్యంలో 'షీ సేఫ్ జోన్' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హైవేపై ప్రయాణించే మహిళలు ఎలాంటి భయాందోళనలు లేకుండా సురక్షితంగా ఆగేందుకు వీలుగా ప్రత్యేక భద్రతా ప్రమాణాలు కలిగిన ప్రాంతాలను గుర్తించి వాటిని అధికారికంగా 'షీ సేఫ్ జోన్'లుగా అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హోటళ్లు, ఫ్యూయల్ స్టేషన్లు తదితర ప్రాంతాల్లో సురక్షిత పార్కింగ్, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాష్‌రూములు, తప్పనిసరి సీసీటీవీ నిఘా, తగినంత లైటింగ్, విశ్వసనీయ సిబ్బంది వంటి సౌకర్యాలు ఉండేలా ప్రమాణాలు రూపొందించారు. ఈ ప్రమాణాలను పూర్తిగా అమలు చేసే ప్రాంతాలను సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అధికారికంగా 'షీ సేఫ్ జోన్'లుగా గుర్తించనుంది. ఇందులో భాగంగా శుక్రవారం పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ రాజీవ్ రహదారిపై ఉన్న పలు హోటళ్లు, ఫ్యూయల్ స్టేషన్లు, ఇతర సౌకర్యాల ప్రాంతాలను స్వయంగా సందర్శించి అక్కడి వసతులు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేం దుకు సంబంధిత యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, మహిళల భద్రతను మరింత బలోపేతం చేయడమే 'షీ సేఫ్ జోన్' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇది ఒక నిరంతర ప్రక్రియ అని పేర్కొంటూ, హైవేపై కీలక ప్రాంతాలను గుర్తించి రాబోయే నెల రోజుల్లో అవసరమైన అన్ని భద్రతా ప్రమాణాలను అమలు చేయించి పూర్తి స్థాయి 'షీ సేఫ్ జోన్'లుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు.

# బీజేపీ మహిళా మోర్చా జిల్లా కమిటీ ఎన్నిక

- పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

ప్రజానావ, సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా కమిటీని ప్రకటించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి ల సమక్షంలో జిల్లా మహిళా మోర్చా నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు గా దాసరి పూర్ణిమ (ఎల్లారెడ్డిపేట మండలం), మంత్రి సంతోష (వేములవాడ అర్బన్ మండలం), జిల్లా ఉపాధ్యక్షులు గా రెడ్డబోయిన మనోజ్ఞ (సిరిసిల్ల పట్టణం), భీమనపల్లి శోభ (సిరిసిల్ల పట్టణం), తుమ్మల రాజవ్వ (వేములవాడ అర్బన్ మండలం), జిల్లా కార్యదర్శులు గా ఎక్కలదేవి జమున (గంభీరావుపేట మండలం), గుంటుక మంజుల (సిరిసిల్ల పట్టణం), జొన్నకంటి తేజశ్రీ (ఎల్లారెడ్డిపేట మండలం), జిల్లా అధికార ప్రతినిధి గా సుధా గోని నిశ్చిత (కోనరావుపేట మండలం), జిల్లా మన్ కీ బాత్ కన్వీనర్ గంగాధర మమత (చందుర్తి మండలం) ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి నూతనంగా నియమితులైన మహిళా మోర్చా జిల్లా కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేసి సంస్థను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

# మహంకాళి బోనాలకు ట్రాఫిక్ ఆంక్షలు

- ఆగస్టు 2 నుంచి 4 వరకు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు
- మహంకాళి ఆలయం పరిసరాల్లో వాహనాల రాకపోకలకు పరిమితులు
- 14 ప్రత్యేక పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు




ప్రజానావ, హైదరాబాద్: సికింద్రాబాద్‌లో జరిగే ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరను పురస్కరించుకుని ఆగస్టు 2 నుంచి 4 వరకు నగరంలో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో మహంకాళి ఆలయం చుట్టూ సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. జాతర సందర్భంగా పొగాకు బజార్, సుభాష్ రోడ్, హిల్ స్ట్రీట్ రహదారులను తాత్కాలికంగా మూసివేయనున్నారు. అలాగే జనరల్ బజార్ నుంచి మహంకాళి ఆలయం వైపు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తారు. ప్యాట్నీ, ప్యారడైజ్, రాణిగంజ్, ఘాస్ మండి, బైబిల్ హౌస్, కర్బాలా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లించనున్నారు. భక్తుల సౌకర్యార్థం హరిహర కళాభవన్, మహబూబ్ కాలేజీ, సీఎంఆర్ మాల్, వెస్లీ కాలేజ్, జింఖానా గ్రౌండ్, స్వప్నలోక్ సహా మొత్తం 14 ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఆర్టీసీ బస్సులకు ప్రత్యేక మార్గాలు

ప్యాట్నీ నుంచి ట్యాంక్‌బండ్‌కు వెళ్లే వాహనాలను ప్యారడైజ్, క్లాక్‌టవర్ మీదుగా మళ్లించనుండగా, ప్యారడైజ్ నుంచి ఎంజీ రోడ్ వెళ్లే వాహనాలను సింధీ కాలనీ మార్గంలో డైవర్ట్ చేయనున్నారు. ఆర్టీసీ బస్సులకు కూడా ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. జాతర రోజుల్లో ప్రయాణికులు ముందుగానే తమ ప్రయాణాన్ని ప్రణాళికాబద్ధంగా రూపొందించుకుని, ట్రాఫిక్ పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అలాగే ట్రాఫిక్ సిబ్బందికి సహకరించి, అనవసరంగా రద్దీ ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# జపాన్‌కు డ్రైవర్ల శిక్షణపై భాగస్వామ్యం దిశగా అడుగులు

- సిరిసిల్ల జిల్లా తంగళ్ల పల్లి మండలం బద్దెనపల్లి ఐటీడీఆర్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించిన జపాన్ ప్రతినిధులు

ప్రజానావ, సిరిసిల్ల : జపాన్‌కు నైపుణ్యమైన భారతీయ ప్రొఫెషనల్ డ్రైవర్లను తీర్చిదిద్దే లక్ష్యంతో హనా విస్టా కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణలోని ఐటిడిఆర్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్య అవకాశాలను పరిశీలించేందుకు జపాన్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం సైట్ విజిట్ నిర్వహించారు. ఈ పర్యవేక్షణ సంస్థ సీఈఓ సయూరి మత్సునో తెలంగాణ ఐఏఎస్ అధికారి హరి ప్రసాద్ ఆదేశాల మేరకు పర్యవేక్షించారు. డ్రైవింగ్ శిక్షణ విధానం, మౌలిక సదుపాయాలు, శిక్షణ పరికరాలు, నిర్వహణ ప్రమాణాలు, మొత్తం శిక్షణ వాతావరణాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే భారతీయ ప్రొఫెషనల్ డ్రైవర్లకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పరస్పర సహకారంపై చర్చించి, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ భాగస్వామ్యం అమల్లోకి వస్తే తెలంగాణ యువతకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ పర్యవేక్షణలో జిల్లా రవాణాశాఖ అధికారి దేవునూరి శ్రీనివాస్, మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీధర్, ఐటీడీఆర్ ప్రిన్సిపాల్ దొరయ్ మురుగన్ పాల్గొన్నారు.

# సర్‌ను ఉపయోగించుకోండి మీ ఓటును కాపాడుకోండి

## సర్ 100 శాతం పూర్తయిన సందర్భంగా

## చెన్నూర్ టౌన్ బీఎల్‌వో, బీఎల్ఏలకు సన్మానం

ప్రజానావ, మంచిర్యాల : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టిన సర్ లో భాగంగా చెన్నూర్ మున్సిపాలిటీలో వేగంగా పూర్తి చేసుకున్న సందర్భంగా చెన్నూర్ పట్టణంలో 186,191,192,194వ పోలింగ్ బూతు పరిధిలో 100% పూర్తి చేసుకున్న సందర్భంగా బీఎల్‌వో గడ్డం మమత, చకిన అనూష, తోట లావణ్య, SK రజియ సుల్తానా, బీఎల్ఏ గుండేటి మధు, సయ్యద్ సాహిర్, ఎండీ.వసీం, ఎండి సుల్తాన్, చెన్నూర్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ కోట్య నాయక్, పుల్లూరి లక్ష్మణ్ డీసీసీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ, చెన్నూర్ బ్లాక్ ఇన్‌చార్జ్, చెన్నూరు మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ శ్రీనివాస్, మూడో వార్డ్ కౌన్సిలర్ అంబటి శంకర్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. పాల్గొన్న ఇతర ముఖ్య నాయకులు పాతర్ల నాగరాజు, చెన్నూరి రాజేష్, సుశీల్, ఖలీల్, లింగంపల్లి మహేష్ చెన్నూర్ టౌన్ కన్వీనర్, యూత్ కాంగ్రెస్ చెన్నూర్ మండల వైస్ ప్రెసిడెంట్ కొండు వెంకటేష్, చెన్నూర్ మండల ఇన్‌చార్జ్, డీసీసీ సెక్రటరీ, బాప గౌడ్ చెన్నూరు మండల అధ్యక్షుడు కాత్రాల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు



# పార్లమెంట్‌ను సాగనివ్వని.. లాఠీఛార్జ్, పెల్లెట్‌గన్స్!

విపక్షాలు కేవలం ఆందోళనలతో పార్లమెంట్‌ను స్తంభింప చేస్తున్నారు. పార్లమెంట్‌లో లాఠీఛార్జ్‌పై చర్చకు పట్టుబట్టడం ద్వారా తమ మొండి వైఖరిని కనబరుస్తున్నారు. పార్లమెంట్ బయటా ప్లకార్డులతో ప్రదర్శనలు చేస్తున్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్ వాడడంపై నిలదీస్తున్నారు. అమిత్ షా క్షమాపణలు చెప్పా లని డిమాండ్ చేస్తుండడంతో సభ సాగడం లేదు. ఇలా ఉభయసభలు రోజూ వాయిదా పడుతూనే ఉన్నాయి. జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పార్లమెంట్ సజావుగా సాగడం లేదు. వారం దాటినా కార్యక్రమాలు చేపట్టలేక పోయారు. వలం పేపర్ లీక్ బిల్లు మాత్రం ఆమోదం పొందింది. ఇక అనేకానేక సమస్యలు ఉన్నా వాటిపై చర్చ సాగుతుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే గతంలోనూ ఇలాగే సాగింది. గత పార్లమెంట్ రికార్డును పరిశీలిస్తే ఇదే కనిపిస్తుంది. విపక్షాలు కేవలం ఆందోళనలతో పార్లమెంట్‌ను స్తంభింప చేస్తున్నారు. పార్లమెంట్‌లో లాఠీఛార్జ్‌పై చర్చకు పట్టుబట్టడం ద్వారా తమ మొండి వైఖరిని కనబరుస్తున్నారు. పార్లమెంట్ బయటా ప్లకార్డులతో ప్రదర్శనలు చేస్తున్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్ వాడడంపై నిలదీస్తున్నారు. అమిత్ షా క్షమాపణలు చెప్పా లని డిమాండ్ చేస్తుండడంతో సభ సాగడం లేదు. ఇలా ఉభయసభలు రోజూ వాయిదా పడుతూనే ఉన్నాయి. జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే బలప్రయోగానికి దిగడంపై ప్రతిపక్ష పార్టీలు హక్కుల సంఘా లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అయితే జంతర్ మంతర్ ఘటనలో పలుఉవరు పోలీసులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. కొందరి తలలు పగిలాయి. ఎందరో రక్తమోడారు. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదని ఆయా కుటుంబాలు వాపోతున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే పోలీసులు రెండురకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటుంటారు. ఆందోళనలను అణచివేయడంతో పాటు, తమతను తాము కాపాడు కుంటూ, పై అధికారులను కాపాడాలి. ఈ సందర్భంగా వారు విధిలేని సమయంలో లాఠీఛార్జ్‌కు పాల్పడాల్సి వస్తుంది. ఇకపోతే అనేక సందర్భాల్లో అతిగా కూడా వ్యవహరించిన సంఘటనలు ఉన్నాయి. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత ప్రకారం ఎలాంటి గుంపునైనా చెదరగొట్టడానికి నోటీసులు ఇచ్చిన తర్వాతే బలప్ర యోగం చేయాలి. మానవ హక్కుల కమిషన్ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్, హెచ్చరికల తర్వాతే అత్యల్ప బలాన్ని ఉపయోగించాలి. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులను క్షేత్రస్థా యిలో పోలీసులు పూర్తిగా కాలరాస్తున్నారు. అరెస్టు సమయంలో పాటించాల్సిన చట్టబద్ధమైన ప్రక్రియలు వలం కాగితాల పరిమిత మవుతున్నాయి. అరెస్టు నిబంధనలు ఎల్లప్పుడూ పాటిస్తున్నామని వలం 41 శాతం మంది పోలీసులు మాత్రమే అంగీకరిస్తున్నారు. అరెస్టు చేసిన వ్యక్తులకు కారణాలు చెప్పడం, వైద్య పరీక్షలు నిర్వ హించడం వంటివి సరిగ్గా జరగడం లేదు. నిందితులు తమ న్యాయ వాదిని సంప్రదించే హక్కును శాశ్వతంగా రద్దు చేయాలని 20 శాతం మంది పోలీసులు వాదిస్తున్నారు. లాఠీఛార్జీలు, హింసాత్మక సంఘట నల్లో గాయపడిన పౌరుల లెక్కల విషయంలో అధికారిక గణాంకాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. మానవ హక్కుల ఉల్లంఘనలు, కస్టడీ మరణాల వివరాల సేకరణలో మన డేటా వ్యవస్థ విఫల మవుతోంది. పోలీస్ వ్యవస్థలో సమూల సంస్కరణలు తేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పౌరుల హక్కుల రక్షణతో పాటు చట్ట పాలన సక్రమంగా సాగేలా చూడటమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష. ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ మార్గాలను ఎంచుకోవడం పోలీసు వ్యవస్థ తీవ్ర నష్టం కలిగిస్తుంది. పోలీసులు చట్టానికి లోబడి పనిచేసేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శిక్షణ సమయంలో మానవ హక్కుల పట్ల అవగాహన పెంచడం ద్వారానే పౌర హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుంది. కానీ స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2025 సర్వేలో వెల్లడైన నిజాలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. 17 రాష్ట్రాల్లోని 8,276 మంది పోలీసుల అభిప్రాయాలను సేకరించగా విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. పోలీసు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎక్కువ మంది తమ చర్యలపై ఎలాంటి విచారణ ఉండదని భావిస్తున్నారు. ఈ సర్వేలో వెల్లడైన గణాం కాలు దేశంలో పోలీసుల అధికార దుర్వినియోగానికి అద్దం పడుతున్నా యి. సర్వేలో పాల్గొన్న వారిలో 70 శాతానికి పైగా పోలీసులు బాధ్యతల నిర్వహణలో బలప్రయోగం చేసినా తమపై ఎలాంటి శిక్ష పడదని స్పష్టం చేస్తున్నారు. కోర్టు విచారణ లేకుండానే అనుమానితులను అరెస్టు చేసి డిటైన్ చేసే అధికారం పోలీసులకు ఉండాలని 69 శాతం మంది కోరుకుంటున్నారు. ప్రజల్లో భయం పుట్టించడానికి కఠిన పద్ధతులు ఉప యోగించడం అత్యంత అవసరమని 55 శాతం మంది పోలీసులు అభిప్రాయపడ్డారు. నిరసనకారులపై లాఠీఛార్జీలు, టియర్ గ్యాస్ ప్రయోగాలు చూస్తున్నప్పుడు ప్రతీ ఒక్కరి మనసులో మెదిలే ప్రశ్న ఇది. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించడానికి సమాజం నుంచి వస్తున్న ఒత్తిడే కారణమని పోలీసులు చెబుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో అమాయకులు సైతం పోలీసుల ఆగడాలకు బలవుతున్నారు. నిందితులపై తీవ్రంగా విరుచుకుపడటానికి ప్రజల ఒత్తిడే ప్రధాన కారణమని మూడిం ట రెండు వంతుల మంది పోలీసులు చెబుతున్నారు. . నేరాల నియంత్ర ణకు అసాంఘిక శక్తుల ముందస్తు అరెస్టులు చాలా ఉపయోగపడతా యని 48 శాతం మంది స్పష్టం చేశారు. నిర్బంధాల కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని 43 శాతం మంది కోరుతు న్నారు. 2024 రైతు ఆందోళనలు, మణిపూర్ నిరసనల్లో పదుల సంఖ్య లో విద్యార్థులు గాయపడినా ఎన్‌సిఆర్‌బి రికార్డుల్లో వలం ఇద్దరేనని చూపించారు. ఈ క్రమంలో ఆందోళనల సమయంలో పోలీసుల తీరును విమర్శించే వారు, వాటిని ఎలా కంట్రోల్ చేయాలో చెప్పాల్సి ఉంది. పోలీసులకు సరైన దిశానిర్దేశం చేయాలి.

నిర్బంధాల కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని 43 శాతం మంది కోరుతు న్నారు. 2024 రైతు ఆందోళనలు, మణిపూర్ నిరసనల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు గాయపడినా ఎన్‌సిఆర్‌బి రికార్డుల్లో వలం ఇద్దరేనని చూపించారు. ఈ క్రమంలో ఆందోళనల సమయంలో పోలీసుల తీరును విమర్శించే వారు, వాటిని ఎలా కంట్రోల్ చేయాలో చెప్పాల్సి ఉంది. పోలీసులకు సరైన దిశానిర్దేశం చేయాలి.

EDITORIAL

# మెడికల్ కాలేజీ హాస్టల్ క్యాంటీన్‌లో ఆహార భద్రతా ఉల్లంఘనలు

- పప్పులు, ఆహార పదార్థాల్లో పురుగులు
- అపరిశుభ్ర వంటశాలపై ఫుడ్ సేఫ్టీ అధికారుల చర్యలు

**ప్రజానావ, సంగారెడ్డి:** సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్ క్యాంటీన్‌లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో తీవ్ర ఆహార భద్రతా, పరిశుభ్రత లోపాలు వెలుగుచూశాయి. సహాయ ఆహార నియంత్రణ అధికారి అమృత శ్రీ, ఆహార భద్రత అధికారి రాజేశ్వర్ శుక్రవారం వంటశాలను తనిఖీ చేయగా, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, వంటశాల నిర్వహణలో పలు నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. తనిఖీల సందర్భంగా కిరాణా నిల్వ డబ్బాలకు మూతలు లేకుండా ఉంచడం వల్ల పప్పులు, ఇతర ఆహార పదార్థాలు పురుగులు, నల్ల బీటిల్స్ బారి న పడినట్లు అధికారులు గుర్తించారు. వంటశాల నేల అపరిశుభ్రంగా, జారిపోయే స్థితిలో ఉండటంతో పాటు డ్రైనేజీల వద్ద ఆహార వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నట్లు గుర్తించారు. అలాగే లేబుల్ పై తప్పనిసరి వివరాలు లేకుండా విడిగా మిరపపొడిని వినియోగించడం, ఆహారాన్ని నిర్వహించే సిబ్బందికి వైద్య ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోవడం వంటి లోపాలను కూడా గుర్తించారు. నిబంధనల అమలులో భాగంగా పురుగులు పట్టిన 40 కిలోల ఇడ్లీ రవ్వ, 30 కిలోల కందిపప్పు, లేబుల్ లేని 21 కిలోల మిరపపొడి, ఇతర కలుషిత మసాలా దినుసులు, కిరాణా సరుకులను సంఘటనా స్థలంలోనే స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఆహార భద్రత, పరిశుభ్రత నిబంధ నలను ఉల్లంఘించినందుకు సంబంధిత క్యాంటీన్ నిర్వహణదారుపై షెడ్యూల్–IV కింద అడ్జుడికేషన్ కేసు నమోదు చేసి, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. అదనంగా, మహారాష్ట్రలో తయారైన పాల నమూనాను సేకరించి ప్రయోగశాల పరీక్షల కోసం పంపించినట్లు అధికారులు తెలిపారు.

# తెలంగాణలో వైన్ టూరిజానికి కొత్త దిశ

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- అమెరికా వైనరీల అధ్యయనం
- రంగారెడ్డి, వికారాబాద్‌లో అవకాశాల పరిశీలన



**ప్రజానావ, నాగర్‌కర్నూల్:** తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, అంతర్జాతీయ స్థాయి నమూనాలను అధ్యయనం చేసి రాష్ట్రానికి అనువైన వైన్ టూరిజం విధానాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీని సందర్శించిన మంత్రి, సెల్లార్ టూర్‌లో పాల్గొని వైన్ తయారీ ప్రక్రియ, వైనరీ నిర్వహణ విధానాలను పరిశీలించారు. అనంతరం ఆష్‌బర్న్‌లోని మరో వైనరీని సందర్శించి అక్కడి ప్రతినిధులతో ద్రాక్ష సాగు, వైన్ తయారీకి అనువైన రకాలు, ప్రాసెసింగ్, ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ద్రాక్ష తోటలు, వైనరీలను పర్యాటకంతో అనుసంధానిస్తూ గైడెడ్ టూర్లు, హాస్పిటాలిటీ సేవలు, సందర్శకులకు ప్రత్యేక అనుభూతులను కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష తోటలు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని పేర్కొంటూ, ఆయా ప్రాంతాల వాతావరణం, ద్రాక్ష సాగుకు అనువైన పరిస్థితులు, స్థలాల ఎంపిక, పెట్టుబడి నమూనాలపై అధ్యయనం చేసి ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. వైన్ టూరిజం ద్వారా పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం, ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణ, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణ పర్యాటక విధానం 2025–30లో భాగంగా వినూత్న పర్యాటక ఉత్పత్తుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ టూరిజం కాన్క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో పలు పర్యాటక ప్రాజెక్టులకు ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రాష్ట్రంలోనే తొలిసారిగా వైనరీ వాక్–త్రూ అనుభూతితో కూడిన వైన్‌యార్డ్ రిసార్ట్‌కు సంబంధించిన ప్రతిపాదన కూడా ఉందన్నారు. ఇందులో ద్రాక్ష సాగు నుంచి వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం ప్రక్రియను సందర్శకులు ప్రత్యక్షంగా వీక్షించే అవకాశంతో పాటు సంప్రదాయ పద్ధతిలో ద్రాక్షను తొక్కే గ్రేప్ స్టాంపింగ్ అనుభూతిని కూడా పొందేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా విజయవంతమైన నమూనాలను అధ్యయనం చేసి, ద్రాక్ష తోటలు, వైనరీలు, హాస్పిటాలిటీ, స్థానిక వంటకాలతో సమన్వయం చేస్తూ తెలంగాణకు ప్రత్యేకమైన వైన్ టూరిజం నమూనాను అభివృద్ధి చేసే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఈ పర్యటనలో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

# గోదావరి వరదలపై జిల్లా యంత్రాంగం హై అలర్ట్

- రెండో ప్రమాద హెచ్చరికతో క్షేత్రస్థాయిలో కలెక్టర్ అంకిత్ పర్యటన
- లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచన



**ప్రజానావ, భద్రాచలం:** భద్రాచలం వద్ద గోదావరి నదికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ కావడంతో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా విస్తా కాంప్లెక్స్ స్లూయిస్ వద్ద వరద నీటి పారుదల పరిస్థితిని, మోటార్ల పనితీరును ఇరిగేషన్ అధికారులతో సమీక్షించిన కలెక్టర్, నీరు వేగంగా బయటకు వెళ్లేలా మోటార్లను నిరంతరం పనిచేసేలా చూడాలని, ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం కరకట్టపై నుంచి గోదావరి వరద ఉధృతిని పరిశీలించి స్నానఘట్ల పరిస్థితిని సమీక్షించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను గోదావరిలోకి అనుమతించరాదని, ప్రమాద ప్రాంతాల వద్ద నిరంతర నిఘా కొనసాగిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కూనవరం–భద్రాచలం ప్రధాన రహదారిపై వరద నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించి, రహదారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రాకపోకలకు అంతరాయం కలిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో వరద ప్రవాహం వేగంగా పెరుగుతోందన్నా రు. గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 11,44,645 క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోందని, నీటిమట్టం 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆలస్యం చేయ కుండా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలతో పాటు మహిళలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. వరదల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొంటూ, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజల నుంచి వచ్చే ప్రతి సమాచారంపై వెంటనే స్పందించాలని సూచించారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉందని, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలకు సహాయాన్ని అందించేందుకు భద్రాచలం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు పనిచేస్తోందని వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఫోన్ 08744–241950, వాట్సాప్ 9392919743 ద్వారా సమాచారం అందించా లని సూచించారు. వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ, గోదావరి వరద ఉధృతి అధికంగా ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్ఫీలు, వీడియోల కోసం ప్రమాద ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని హెచ్చరిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌కు లేదా 100 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో సమన్వయంతో ప్రజల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ ఎస్ఈ మహేశ్వర రావు, దేవస్థానం ఈవో దామోదర్‌రావు, భద్రాచలం తహసీల్దార్ రామకృష్ణ, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బృందాల అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆలేరు రెవెన్యూ డివిజన్ కోసం అఖిలపక్ష పోరాటం ఉధృతం

- పట్టణ బంద్, రాస్తారోకో, ధర్నాతో ప్రభుత్వానికి హెచ్చరిక.. హామీలు అమలు చేయాలని డిమాండ్




**ప్రజానావ, ఆలేరు:** ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలేరు పట్టణ బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద రాస్తారోకో, అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు తమ నిరసనను తెలియజేశారు. ఈ ఆందోళనలో బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, బీఎస్పీ, అంబేద్కర్ యువజన సంఘం, వ్యాపార సంఘం, మీడియా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు మాట్లాడుతూ, ఆలేరు పేరుకే అసెంబ్లీ కేంద్రంగా ఉన్నప్పటికీ విద్య, వైద్యం, వ్యాపారం, పరిశ్రమలు తదితర రంగాల్లో అభివృద్ధికి దూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన కోసం నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ఇదే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో కూడా రెవెన్యూ డివిజన్ అంశాన్ని ఓట్ల కోసం మాత్రమే ఉపయోగించుకున్నారని, కానీ దాని ఏర్పాటుపై చిత్తశుద్ధి కనిపించడం లేదని మండిపడ్డారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఆలేరు అసెంబ్లీ కేంద్రంలో ఉండాల్సిన పలు ప్రభుత్వ కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిపోయాయని, ఇటీవల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని యాదగిరిగుట్టకు మార్చడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ కార్యాలయాలు ఒక్కొక్కటిగా తరలిపోతే భవిష్యత్తులో డిలిమిటేషన్ సందర్భంగా ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ హోదా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటైతే ఆలేరు, రాజపేట, యాదగిరిగుట్ట, మోటకొండూరు, గుండాల మండలాలతో కలిపి ఐదు మండలాలు, 98 గ్రామాలు పరిధిలోకి వస్తాయని తెలిపారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంతో పాటు మరో 23 అనుబంధ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పడి, వందలాది గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడంతో పాటు పట్టణ అభివృద్ధికి ఊతమిస్తుందని పేర్కొన్నారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసే వరకు తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అఖిలపక్ష కమిటీ హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, కో–కన్వీనర్ చెక్క వెంకటేష్, రాచకొండ జనార్ధన్, వడ్డెమాన్ నరేందర్, పుట్ట మల్లేష్, మొరిగాడి శేఖర్, మొరిగాడి రమేష్, తుంగ కుమార్, చిరిగే శ్రీనివాస్, ఇక్కిరి సహదేవ్, ఇక్కిరి శ్రీనివాస్, ఎలుగల వెంకటేష్, ఎలుగల కుమారస్వామి, చిలుకూరు నర్సిరెడ్డి, పూల హనుమంత్, గంగుల శ్రీనివాస్, కంతుల శంకర్, బేతి కృష్ణహరి, సీహెచ్ ప్రకాష్, కందుల దుర్గేష్, వంగాల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పదవీ విరమణ పొందిన పోలీసులకు ఘన సన్మానం

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో** : నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఏ.గోపాల్ ఏఎస్ఐ, చారకొండ పిఎస్, ఎండి. మహమ్మద్ పాషా హెచ్‌సి, ఊరకొండ పిఎస్ లను జిల్లా అదిష నల్ ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానిం చారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల భద్రత కోసం వీరు అందించిన నిబద్ధతతో కూడిన సేవలు చిరస్మరణీ యమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కుటుంబంతో సంతోషంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి డీఎస్పీ సాయి వెంకట్ రెడ్డి, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, సీసీఎస్ సీఐ శంకర్, ఏఓ కృష్ణయ్య, పోలీస్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు గుణవర్ధన్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు అధిక లాభాలు

- వరి సాగుకు బదులుగా లాభదాయక పంటలను ప్రోత్సహించాలి
- అధికారులకు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** వరి సాగుకు ప్రత్యామ్నాయంగా లాభదాయక పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జూమ్ సమావేశంలో పాల్గొన్న ఆయన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జొన్నలు, పెసలు, మినుములు, కంది, ఆముదం, కూరగాయలు, పూల తోటల సాగును ప్రోత్సహించేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రయోజనాలను రైతులకు వివరించాలని చెప్పారు. అలాగే ఆయిల్ పామ్ సాగు ద్వారా లభించే ఆర్థిక ప్రయోజనాలు, మార్కెట్ అవకాశాలపై కూడా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణం గా పంటల ఎంపిక చేసుకునేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# విశ్వశాంతి మహాయాగంలో భక్తి వెల్లువ

- విద్యార్థుల భాగస్వామ్యంతో ఆధ్యాత్మిక శోభ..
- వేలాది మందికి ప్రసాద వితరణ



**ప్రజానావ, కల్వకుర్తి:** ప్రపంచ మానవాళి సుఖ శాంతులు, సౌభాగ్యాలతో జీవించాలని సంకల్పించి కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ మైదానంలో నిర్వహిస్తున్న 91వ విశ్వశాంతి మహాయాగం భక్తి పారవశ్యంతో కొనసాగుతోంది. శుక్రవారం యాగం 13వ రోజుకు చేరుకోగా, వివిధ పాఠశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా భక్తులు భక్తిశ్రద్ధలతో యాగంలో పాల్గొనగా, రుత్వికుల వేదమంత్రోచ్చారణలు, రుద్ర, నమక, చమకాల ఘోషతో కల్వకుర్తి ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. ద్వాదశ సహస్ర మృతిక (మట్టి) శివలింగాలకు పంచామృతాభిషేకం నిర్వహించి, మారేడు దళాలు, వివిధ పుష్పాలు, పసుపు, కుంకుమ, గంధం, భస్మాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లక్ష శివలింగాలకు రుద్రాభిషేకం నిర్వహించగా, పంచాక్షరి మంత్ర జపంతో భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి మాట్లాడుతూ, బోళా శంకరుని కరుణాకటాక్షాలు భక్తులందరిపై ఉండాలని ఆకాంక్షించారు. దైవభక్తితో జీవిస్తూ సమాజ సేవలోనూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం విశేష శ్రీచండీ హోమం, శ్రీమహాలక్ష్మీ హోమం, విశేష లక్ష్మీ పాశుపత హోమం, అష్టలక్ష్మీ –సరస్వతి హోమాలను ఘనంగా నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం కోటి కుంకుమార్చన, పుష్పార్చనలు, శ్రీచక్ర విశేష అభిషేకం, అర్చనలు వైభవంగా జరిగాయి. యాగశాలను సందర్శించిన విద్యార్థులు స్వామీజీ ఆధ్యాత్మిక బోధనలను ఆసక్తిగా ఆలకించడంతో పాటు భక్తి గీతాలు ఆలపించి, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం దాండియా, భక్తి గీతాలకు నృత్యాలు ప్రదర్శించి భక్తులను అలరించారు. కార్యక్రమం ముగింపులో దాదాపు ఆరు వేల మంది భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికీ దైవానుగ్రహం లభించాలని, భక్తి కార్యక్రమాలకు సహకరించాలని స్వామీజీ కోరారు. కార్యక్రమంలో జూలూరి రమేష్‌బాబు, బీచని బాలకృష్ణ, మాచిపెద్ది రామస్వామి, పోలా సురేందర్, చిగుల్లపల్లి సతీష్, కల్మిచర్ల గోపాల్, గుబ్బ వెంకటేష్, మదన మురళి, పెద్దయ్య గౌడ్, జంగయ్య, అశోక్, గణేష్‌తో పాటు యాగ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




# థర్మల్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో లోటు ఉండొద్దు

- రోజుకు కనీసం 28 రేకుల బొగ్గు రవాణా చేయాలి
- సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి
- వరదల సమయంలో ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయంగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశం

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా అన్ని ఏరియాల అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి ఆదేశించారు. విద్యుత్ కేంద్రాల అవసరాలకు అనుగుణంగా రోజుకు కనీసం 28 నుంచి 32 రేకుల ద్వారా నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో నిర్వహించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్‌బర్డెన్ తొలగింపు, నాణ్యత అంశాల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల ప్రభావంతో ఓపెన్‌కాస్ట్ గనుల ఉత్పత్తిపై కొంత ప్రభావం పడుతున్నప్పటికీ, ముందస్తు ప్రణాళికతో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను తప్పకుండా చేరుకోవాలని సూచించారు. అదే సమయంలో వర్షాకాలంలో భూగర్భ గనుల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు మొత్తం బొగ్గు సరఫరాలో 75 నుంచి 80 శాతం వరకు సింగరేణి నుంచే అందుతున్నట్లు పేర్కొన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు ఉన్న నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సింగరేణి రెస్క్యూ బృందాలు, ఇతర విభాగాల అధికారులు అత్యవసర సహాయక చర్యలకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సీఎండీ ఆదేశించారు. అలాగే బొగ్గు ఉత్పత్తికి అనుగుణంగా అన్ని ఓపెన్‌కాస్ట్ గనుల్లో లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 500 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్ తొలగింపు లక్ష్యాలను చేరుకునేందుకు కొత్త గనులకు అవసరమైన అనుమతుల ప్రక్రియను ఇప్పటి నుంచే వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్), గౌతమ్ పోట్రు (పర్సనల్, ఫైనాన్స్), ఎం. తిరుమలరావు (ఈ అండ్ ఎం), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి. శ్రీనివాస్‌తో పాటు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ విభాగాల అధికారులు, శాఖాధిపతులు పాల్గొన్నారు.

# చనిపోయిన కార్మికుల స్థానాల్లో వారి వారసులను నియమించాలి

- పనిలో ఉన్న కార్మికులకు పని భారం తగ్గించాలి
- మున్సిపల్ చైర్ పర్సన్‌కు సీఐటీయూ నాయకుల వినతిపత్రం
- సానుకూలంగా స్పందించిన చైర్ పర్సన్ జిందం కళ



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ లో ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తూ చనిపోయిన కార్మికుల, 60 ఏళ్ళ వయస్సు పైబడి విధుల నుండి తొలగించిన అవుట్సోర్సింగ్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించి విధుల్లోకి తీసుకుని మిగతా కార్మికులకు పని భారం తగ్గించాలని సిఐటియు సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ఎగమంటి మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్ లో విధులు నిర్వహిస్తూ చనిపోయిన కార్మికుల స్థానంలో అలాగే 60 సంవత్సరాల వయసు పైబడి విధుల నుండి తొలగించబడిన కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని అన్నారు. ఇలాంటి కారణాలవల్ల సరిపడా కార్మికులు లేక మిగతా కార్మికులకు పని భారం పెరుగుతున్న మాట వాస్తవమేనని, కార్మికులకు పని భారం కాకుండా అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపడతామని, కార్మికులకు పని భారం కాకుండా వారి సంక్షేమానికి ఖచ్చితంగా తమ పాలకవర్గం పెద్దపీట వేస్తుందని అన్నారు.

# సంపూర్ణ గోవధ నిషేధ చట్టం తేవాలని కలెక్టరేట్ ఏవోకు వినతి

**ప్రజానావ, పెద్దపల్లి :** గోసన్మాన్ అవన్ అభియాన్ లో బగంగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఒ బండి ప్రకాష్ కి వినతిపత్రం అందజేశారు. సంపూర్ణ గోవదా నిషేధ చట్టం తేవాలని, గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరారు. కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలనీ, గోగ్రాస బోర్డును ఏర్పాటు చేయాలనీ అన్నారు. కగోఆధారిత వ్యవసాయాన్ని ప్రాశ్చాహించాలని, దేసియా గోవు యొక్క ప్రాముఖ్యతను విద్యలో చేర్చాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హిందూసంఘ నాయకులు నాగులామల్యాల సత్యం, జంజీపెల్లి దిలీప్, బొమ్మకంటి రవి గుండా సతీష్, అడిచర్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలులో రాజీ లేదు

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

**ప్రజానావ, వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలోని ఆసుపత్రులు, ప్రైవేట్ పాఠశాలలు, వాణిజ్య సముదాయాల్లో అగ్నిమాపక భద్రతా (ఫైర్ సేఫ్టీ) నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న స్పష్టం చేశారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలను నిర్లక్ష్యం చేసే సంస్థలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. శుక్రవారం జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ లింగంతో కలిసి నగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, పాఠశాలలు, వాణిజ్య సముదాయాల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపేటలోని డి–మార్ట్, రోహిణి ఆసుపత్రితో పాటు హనుమకొండ, వరంగల్ నగరాల్లోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారం వ్యవస్థలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు తదితర భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రతి భవనం యాజమాన్యం సంవత్సరానికి ఒకసారి తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను తనిఖీ చేయించి, సంబంధిత ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్‌ను గడువులోపు పునరుద్ధరించుకోవాలని సూచించారు. గడువు ముగిసిన ఫైర్ సేఫ్టీ అనుమతులతో కార్యకలాపాలు కొనసాగించడం చట్టవిరుద్ధమని, అలాంటి సంస్థలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో ఇప్పటికీ ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను ఏర్పాటు చేయని లేదా అవసరమైన భద్రతా పరికరాలు లేని భవనాలను గుర్తించి, ఆయా యాజమాన్యాలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో అగ్నిమాపక భద్రత అత్యంత కీలకమని పేర్కొంటూ, అన్ని సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించి నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ లింగం, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజేశ్వరరావు, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో పవర్ బోర్ల వద్ద.. 400కు పైగా ఇంకుడు గుంతల నిర్మాణం

- ప్రజల అవసరాలు, పట్టణ అభివృద్ధికి 24 అంశాలకు ఆమోదం
- గణేష్ ఉత్సవాలు, నిమజ్జన పనులకు రూ.20 లక్షల కేటాయింపు
- సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ జిందం కళ




**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజల అవసరాలను పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన 24 అంశాలను ఆమోదించినట్టు మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ వెల్లడించారు. శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ జిందం కళ అధ్యక్షతన నిర్వహించారు. 25 అంశాలతో కూడిన ఎజెండాను ఈ మున్సిపల్ సాధారణ సమావేశంలో ప్రవేశపెట్టగా మున్సిపల్ పాలకవర్గ సభ్యుల తో సమగ్రంగా చర్చించి వారి ఆమోదంతో 24 అంశాలను ఈ సాధారణ సమావేశంలో ఆమోదించుకోవడం జరిగిందన్నారు. ఒక అంశం వాయిదా వేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలోని రగుడు మున్సిపల్ డంపింగ్ యార్డ్ అభివృద్ధి పరచడానికి షెడ్డుల నిర్మాణం, సి.సి. ఫ్లాట్ ఫామ్స్ నిర్మాణం అలాగే ఇంటర్నల్ సి.సి. రోడ్ల నిర్మాణ పనులు చేపట్టుటకు రూ.80.00 లక్షలు కేటాయిస్తూ పరిపాలనపరమైన మంజూరి ఇవ్వడం జరిగినది. సిరిసిల్ల పట్టణంలో సానిటేషన్ నిర్వహణలో భాగంగా రెండు ఎలక్ట్రికల్ ఆటోలు, ఒక ప్రోక్లైన్ (జెసిబి) కొనుగోలు కొరకు రూ.50.00 లక్షలు కేటాయిస్తూ పరిపాలనపరమైన మంజూరి ఇచ్చారు. పట్టణంలో వివిధ వార్డులలో అత్యవసర పనులు అనగా డ్రైన్ కల్వర్టు ల నిర్మాణం, డ్రైనేజీలు, సిసి రోడ్ల ప్యాచ్ వర్కులు అలాగే వివిధ మరమత్తు పనులు చేపట్టుటకు మొత్తం (9) పనులకు గాను రూ. 16.55 లక్షలు కేటాయిస్తూ పరిపాలనపరమైన మంజూరి ఇచ్చారు. పట్టణంలో రాబోవు వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాలు నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా లైటింగ్, క్లీనింగ్, హైడ్రాలిక్ క్రేన్ల సరఫరా మొదలగు పనులు చేయుటకు గాను మొత్తం (9) పనుల కోసం రూ. 20.50 లక్షలు కేటాయిస్తూ పరిపాలనపరమైన మంజూరి ఇచ్చారు. పట్టణంలో మొత్తం (39) వార్డులలో గల పవర్ బోర్స్ ల వద్ద అలాగే ఇతర ఏరియాలో సుమారు 400 పైగా ఇంకుడు గుంతలు నిర్మాణం చేయుటకు మొత్తం (6) పనులకు గాను రూ. 30.00 లక్షలు కేటాయిస్తూ పరిపాలనపరమైన మంజూరి చేశారు. పట్టణంలో సానిటేషన్ నిర్వహణలో భాగంగా వర్షాకాలం దృష్ట్యా దోమల నిర్వహణ కొరకు వివిధ కెమికల్స్ , స్ప్రేయింగ్ మిషన్స్ కొనుగోలు చేయుటకు రూ. 1.80 లక్షలు కేటాయిస్తూ పరిపాలనపరమైన మంజూరి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదిర్ ఫాషా,వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ఇంకుడు గుంత లేకుంటే కొత్త ఇళ్లకు ఇంటి నంబర్, నల్లా కనెక్షన్ మంజూరు కాదు
- ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా సోక్‌పిట్‌లు ఏర్పాటు చేయాలి
- కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు పారిశుధ్య చర్యలు పకడ్బందీగా చేపట్టాలి
- ప్రతి వార్డులో నెల రోజుల్లో కనీసం 30 ఇంకుడు గుంతలు నిర్మించాలి
- పట్టణ పరిపాలనపై మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించిన పెద్దపల్లి కలెక్టర్



**ప్రజానావ, పెద్దపల్లి :** జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీ తో కలిసి మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన పట్టణ పరిపాలన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జల శక్తి జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో ఇకపై కొత్తగా నిర్మించే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత (సోక్‌పిట్) తప్పనిసరిగా ఉండాలని, ఇంకుడు గుంత లేని ఇళ్లకు ఇంటి నంబర్, తాగునీటి నల్లా కనెక్షన్ మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇప్పటికే నిర్మించబడిన ఇళ్లలో కూడా వీలైనంత మేర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రతి వార్డు పరిధిలో వచ్చే నెల రోజుల్లో కనీసం 30 ఇంకుడు గుంతలు నిర్మించేలా వార్డు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా సోక్‌పిట్‌లు ఏర్పాటు చేయాలని, వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రహదారులపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా చూడాలని, ప్రజారోగ్యానికి భంగం కలిగించే పరిస్థితులు ఎక్కడా తలెత్తకుండా మున్సిపల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ పోస్టుల అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన గడువు పొడిగింపు

## ఆగస్టు 5 వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సీడీపీఓ నందిని సూచన

**ప్రజానావ, బోధన్:** ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోందని సీడీపీఓ నందిని తెలిపారు. ఈ ప్రక్రియను జూలై 27 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గురువారం నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనకు దరఖాస్తు చేసుకున్న పలువురు అభ్యర్థులు హాజరు కాకపోవడంతో వారికి అవకాశం కల్పించే ఉద్దేశంతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువును ఆగస్టు 5 వరకు పొడిగించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు సంబంధించిన అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఐసీడీఎస్ బోధన్ కార్యాలయానికి వచ్చి తప్పనిసరిగా ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోపు ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించి వెరిఫికేషన్ పూర్తి చేయని అభ్యర్థుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని సీడీపీఓ నందిని స్పష్టం చేశారు.

# భారీ వర్షాలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం

## ప్రజల భద్రతకు తొలి ప్రాధాన్యం.. ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు కామారెడ్డి కలెక్టర్ ఆదేశం

**ప్రజానావ, కామారెడ్డి:** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన వర్షాల ప్రభావాన్ని పరిశీలించి, సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రధాన రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రి ఆవరణలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. భారీ వర్షాలతో పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు ప్రవహిస్తున్న నేపథ్యంలో అక్కడ నిర్వహించిన సంప్రదాయ పూజల్లో పాల్గొన్న ఆయన చెరువు పరిసరాలను పరిశీలించి, ప్రస్తుత పరిస్థితుల్లో చేపల వేటకు వెళ్లవద్దని జాలర్లను హెచ్చరించారు. ప్రజలు ప్రమాదవశాత్తు చెరువు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మున్సిపల్, పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ప్రాణ భద్రతే జిల్లా యంత్రాంగం తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. భారీ వర్షాల సమయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, చెరువులు, కాలువలు, నీటి నిల్వలు వంటి ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ టి. పర్వతాలు, తహసీల్దార్ హిమబిందు, స్థానిక కౌన్సిలర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ ఎన్. హన్మంతరావు నాయక్, టౌన్ ప్లానింగ్ అధికారి ఎ. వినీత్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సి.హెచ్. వేణుప్రసాద్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌లో జనగామకు రాష్ట్రంలోనే అగ్రస్థానం

## 99.79 శాతం ప్రక్రియ పూర్తి.. పారదర్శక ఓటరు జాబితా లక్ష్యం: జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజానావ, జనగామ:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో జనగామ జిల్లా రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లాలో 99.79 శాతం డిజిటలైజేషన్ విజయవంతంగా పూర్తికావడంతో రాష్ట్రవ్యాప్తంగా తొలి స్థానాన్ని జనగామ జిల్లా దక్కించుకుందని వెల్లడించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్ఐఆర్ రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాను మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా రూపొందించడమే ప్రత్యేక రివిజన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి ఓటరు సులభంగా చేరుకునేలా రెండు కిలోమీటర్ల పరిధిలోనే పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న 13 పోలింగ్ కేంద్రాలను గుర్తించి, నిబంధనల ప్రకారం అదనపు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఫ్యామిలీ కార్డు ఆధారంగా కుటుంబ వివరాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. నివాసం మార్చుకున్న షిఫ్టెడ్ ఓటర్ల వివరాలను గుర్తించి, ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అనుగుణంగా ఓటరు జాబితాలో సవరణలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రావెల రవి (బీఆర్ఎస్), పి. జగదీశ్ (బీజేపీ), బి. భాస్కర్, యు. రవి యాదవ్ (కాంగ్రెస్), జోగు ప్రకాష్ (సీపీఎం), శ్రీనివాస్ (టీడీపీ) తదితరులు పాల్గొన్నారు.

# పేద కులబాంధవులకు బాసటగా మున్నూరు కాపు సంఘం

## జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్ పటేల్

**ప్రజానావ, పెద్దపల్లి :** మున్సిపల్ పరిధి చందపల్లి మున్నూరు కాపు గ్రామ అధ్యక్షులు గంగుల రాకేష్ పటేల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బొగ్గుల తిరుపతి కుటుంబానికి రూ.20,500 ల ఆర్థిక సాయాన్ని మున్నూరు కాపు పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు జడల సురేందర్, రాష్ట్ర నాయకులు ఎల్ రాజయ్య, అమీరిశెట్టి రామస్వామి, జిల్లా నాయకులు, గ్రామ నాయకులు అందరూ కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు జిల్లా అధ్యక్షులు జడల సురేందర్ పటేల్ మాట్లాడుతూ పేద కులబాంధవులను ఆదుకోవడమే ధ్యేయంగా తాము అందరం పని చేస్తున్నామని స్పష్టం చేశారు. సొంతంగా పేర్లు ప్రకటించుకుంటే సంఘాలు కాబోవని, ప్రజాబలంతో ఎన్నికైన కమిటీకే ప్రజల్లోకి వెళ్లే హక్కు ఉంటుందని సురేందర్ పటేల్ గుర్తుచేశారు. కులాభివృద్ధికి నిజమైన కట్టుబడి ఉంటే ప్రకటనలకే పరిమితం కాకుండా, పోటీపడి పేదలకు ఆర్థిక సాయం చేయాలని సవాలు విసిరారు. సమాజంలో మున్నూరు కాపు కులబంధువులు ఎవరు ఆపదలో ఉన్నా తమ సంఘం తక్షణమే స్పందిస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్. రాజయ్య పటేల్ మాట్లాడుతూ సురేందర్ పటేల్ నాయకత్వంలో ఇప్పటివరకు మూడు విడతల్లో అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించామని, చందపల్లి గ్రామ అధ్యక్షులు గంగుల రాకేష్ పటేల్ మరియు చందపల్లి గ్రామ పెద్దల చొరవతో ఈ విడత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. కేవలం కాగితా లకే పరిమితమయ్యే నకిలీ నాయకులను కులబాంధవులు నమ్మవద్దని, వచ్చే మున్నూరు కాపు సంఘం ఎన్నికల్లో పోటీ చేసి తమ బలాన్ని నిరూపించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో చందపల్లి మున్నూరు కాపు గ్రామ అధ్యక్షులు గంగుల రాకేష్ పటేల్, జిల్లా అధ్యక్షులు జడల సురేందర్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ రాజయ్య పటేల్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రామస్వామి పటేల్, జిల్లా నాయకులు పూదరి శ్రీనివాస్, ఉప్పు రాజ్ కుమార్, వరాల సంపత్ కుమార్, గణపతి రాజేష్, యూత్ నాయకులు అమీరిశెట్టి పూర్ణచందర్, మల్క విక్రాంత్, గ్రామ పెద్దలు, కుల సంఘ నాయకులు లక్కాకుల లింగయ్య, పెర్క మల్లేశం, జాపతి రాజు, గాండ్ల శంకర్, జాపతి తిరుపతి, బొగ్గుల రవి, బొగ్గుల సధి, కుడిది ఉదయ్, రౌతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణలో భాగస్వాములు కావాలి

- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీరాములు
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా స్థాయి నార్కోటిక్ కో ఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్డీ) సమావేశంలో పెద్దపల్లి అదనపు కలెక్టర్



**ప్రజానావ, పెద్దపల్లి :** మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం చేపడుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అలవర్చుకుంటూ మన చుట్టూ ఉన్న ఎవరూ మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్డీ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ యువత జీవితాలను మాదకద్రవ్యాల మహమ్మారి నాశనం చేస్తోందని, సరదా కోసం కూడా ఎటువంటి మత్తు పదార్థాలు లేదా చెడు అలవాట్లకు అలవాటు పడవద్దని సూచించారు. ఒకసారి మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. డ్రగ్స్ విక్రయం, కొనుగోలు, నిల్వ, అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాసంస్థలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాలు, రవాణా కేంద్రాల వద్ద తరచూ తనిఖీలు నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచే చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసు శాఖ లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన లో ప్రజల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతు న్న చర్యలు, కేసుల నమోదు, అవగాహన కార్యక్రమాలు, వివిధ శాఖల సమన్వయంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలను సందర్శించిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్

**ప్రజానావ, మంచిర్యాల :** సర్ భాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఆదేశాలమేరకు రాష్ట్ర మైనింగ్, కార్మిక శాఖ మంత్రి వర్యులు కూడా గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ, ఆధ్వర్యంలో కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పిన్నిటి రఘునాథ్ రెడ్డి అధ్యక్షతన గాంధీ భవన్ నుంచి చెన్నూరు నియోజక వర్గం ఇంచార్జీగా కోట్యా నాయక్ వచ్చారు. కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ, చెన్నూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోటపల్లి మండల ఇంచార్జి పుల్లూరి లక్ష్మణ్, మం చిర్యాల జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొండు వెంకటేష్ కాంగ్రెస్ చెన్నూర్ మండల అధ్యక్షుడు ముత్యాల బాప గౌడ్, కోటపల్లి మండల అధ్యక్షుడు కాట్రాల మల్లయ్య, చెన్నూర్‌లోని కన్నెపల్లి, సంక రం గ్రామా లు సందర్శించారు. కార్యక్రమంలో చెన్నూర్ కాం గ్రెస్ మండల ఉపాధ్యక్షుడు జాడి శ్రవణ్, సంకరం గ్రామ సర్పంచ్ మడె అర్జయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.





# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

- భివండీలో భవనం కుప్పకూలి 8మంది మృతి
- మరమ్మతుల సమయంలో విషాదం
- శిథిలాల కింద మరో ఐదుగురు చిక్కుకున్నట్లు అనుమానం
- ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక బృందాల సహాయక చర్యలు కొనసాగింపు

ప్రజానావ, ముంబై మహారాష్ట్రలోని థానే జిల్లా భివండీలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నాలుగు అంతస్తుల భవనం కూలిపోవడంతో ఎనిమిది మంది మృతి చెందారు. మరో నలుగురు నుంచి ఐదుగురు వరకు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఈ ప్రమాదం జరిగింది. భివండీలోని బాలాజీ నగర్ ప్రాంతంలో ఉన్న కోహినూర్ భవనంలోని ఓ భాగం రాత్రి 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలినట్లు అధికారులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించి రక్షించేందుకు సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. మున్సిపల్ అధికారుల వివరాల ప్రకారం, ఈ భవనంలో మొత్తం 48 గదులు ఉండగా, ప్రతి అంతస్తులో 12 గదులు ఉన్నాయి. ఇప్పటికే ఈ భవనాన్ని ప్రమాదకర భవనంగా గుర్తించినట్లు తెలిపారు. భవనంలో మరమ్మతు పనులు జరుగుతున్న సమయంలోనే ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు వెల్లడించారు. ప్రమాదానికి కొద్దిసేపటి ముందు భవనం నుంచి పెద్ద శబ్దాలు వినిపించాయని స్థానికులు తెలిపారు. దీంతో అప్రమత్తమైన ప్రజలు పలు కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే కొందరు బయటకు వస్తున్న సమయంలోనే భవనంలోని 'బీ' వింగ్ కూలిపోయిందని అధికారులు వివరించారు.

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా
- క్షతగాత్రులకు రూ.50 వేల ఆర్థిక సాయం

**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలోని థానే జిల్లా భివండీలో నాలుగు అంతస్తుల భవనం కూలి తొమ్మిది మంది మృతి చెందిన విషాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ ఆర్ఎఫ్) నుంచి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరి కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున, గాయపడిన ప్రతి ఒక్కరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించిన మోదీ.. మహారాష్ట్రలోని థానేలో భవనం కూలి ప్రాణనష్టం సంభవించడం తీవ్ర వేదన కలిగించింది. ఈ క్లిష్ట సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా అని పేర్కొన్నారు.

### రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

ప్రమాద స్థలంలో సహాయక చర్యలను జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), థానే విపత్తు స్పందన దళం, స్థానిక అగ్నిమాపక సిబ్బంది సంయుక్తం గా చేపడుతున్నారు. డాగ్ స్క్వాడ్, నాలుగు అగ్నిమాపక వాహనాలు, రెండు అంబులెన్సులు, భారీ యంత్రాలను సహాయక చర్యల కోసం వినియోగిస్తున్నారు. ఇదిలా ఉండగా, ప్రస్తుత వర్షాకాలంలో థానే జిల్లాలో వర్షాలకు సంబంధించిన వివిధ ప్రమాదాల్లో ఇప్పటివరకు 27 మంది మృతి చెందగా, మరో 20 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

# యావత్మల్‌లో విషాదం

- వరదలో కొట్టుకుపోయిన కారు
- తల్లి, ఇద్దరు కుమార్తెల మృతి

ప్రజానావ, ముంబై: మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లా దర్వా తాలూకా దహేలి గ్రామం సమీపంలో కుప్తి నది వరదలో కారు కొట్టుకుపోవడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. అవినాష్ ఖండారే చెట్టును పట్టుకుని ప్రాణాలతో బయటపడగా, అతని భార్య మాధవి ఖండారే, కుమార్తెలు ప్రాచీ, సాచీ వరదలో కొట్టుకుపోయారు. రాత్రంతా సాగిన గాలింపు చర్యల అనంతరం ముగ్గురి మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీశాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

# రష్యా చమురుపై అమెరికా ఆంక్షల బిల్లు

- అప్రమత్తమైన భారత్
- 100 శాతం వరకు సుంకాల ప్రతిపాదనపై నిశితంగా పరిశీలిస్తున్నాం
- దేశ ఇంధన భద్రత, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకే ప్రాధాన్యం
- అమెరికాతో సంప్రదింపులు కొనసాగుతున్నాయి: ఎంఈఏ

**న్యూఢిల్లీ :** రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న దేశాలపై 100 శాతం వరకు అదనపు దిగుమతి సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పించే బిల్లును సెనెట్ ఆమోదించిన నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని విదేశాంగ శాఖ (ఎంఈఏ) శుక్రవారం వెల్లడించింది. ప్రస్తుతం ఈ బిల్లు అమెరికా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రెజెంటేటివ్స్) పరిశీలనకు వెళ్లనుంది. ఇంధన భద్రత విషయంలో భారత్ వైఖరి స్పష్టంగా ఉందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. 140 కోట్ల మంది ప్రజల ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ వనరుల నుంచి ఇంధనాన్ని సమకూర్చుకుంటున్నామని చెప్పారు. ఇందులో అమెరికా కూడా కీలక ఇంధన భాగస్వామిగా ఉందన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు సంబంధించి అమెరికాలోని సంబంధిత వర్గాలతో వివిధ స్థాయిల్లో చర్చలు కొనసాగుతున్నాయని జైస్వాల్ పేర్కొన్నారు. దేశ ఇంధన భద్రత, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు.

### బిల్లులో కీలక ప్రతిపాదనలు

అమెరికా సెనెట్ ఆమోదించిన 'లిండ్సే ఓ. గ్రాహమ్ సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్–2026' ప్రకారం రష్యాతో పాటు ఉక్రెయిన్ యుద్ధానికి మద్దతు ఇస్తున్న సంస్థలు, వ్యక్తులపై ప్రాథమిక, ద్వితీయ ఆంక్షలు విధించే అవకాశం ఉంటుంది. అలాగే రష్యా చమురు, గ్యాస్‌ను భారీగా కొనుగోలు చేసే దేశాలు లేదా ఆంక్షల నుంచి తప్పించుకునేందుకు సహకరించే దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 100 శాతం వరకు అదనపు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి కల్పించేలా బిల్లులో నిబంధనలు పొందుపరిచారు.

### భారత్, చైనా సహా ఐదు దేశాలపై దృష్టి

బిల్లులోని సెక్షన్–113 ప్రకారం రష్యా ఇంధనాన్ని అత్యధికంగా కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, స్లోవేకియా, హంగేరీ, అజర్‌బైజాన్ దేశాలు ప్రతిపా దిత సుంకాల పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. ఆయా దేశాల ఇంధన కొనుగోలు విధానాన్ని ప్రతి 180 రోజులకు ఒకసారి సమీక్షించి, అవసరమైతే సుంకాలను సవరించే వెసులుబాటును ఈ బిల్లు కల్పిస్తోంది.

# బహుభార్యత్వంపై సుప్రీం పిటిషన్

- రాజ్యాంగ సమానత్వం, మహిళల హక్కులపై విచారణ
- ముస్లిం వ్యక్తిగత చట్టంలోని పాలిగమీ నిబంధనపై కేంద్రానికి నోటీసులు

**న్యూఢిల్లీ:** ముస్లిం వ్యక్తిగత చట్టం కింద బహుభార్యత్వం (పాలిగమీ) రాజ్యాంగబద్ధమేనా? అనే అంశంపై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. ఇది రాజ్యాంగంలోని సమానత్వం, మహిళల గౌరవప్రదమైన జీవన హక్కులకు విరుద్ధమంటూ మహిళా హక్కుల కార్యకర్తలు జకియా సోమన్, నూర్‌జహాన్ సఫియా నియాజ్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న సంబంధిత కేసులతో ఈ పిటిషన్‌ను జత చేసింది. పిటిషనర్లు మతభేదం లేకుండా దేశంలోని ప్రతి పౌరుడికి రెండో వివాహంపై ఒకే చట్టం అమలు చేయాలని కోరారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 82 ప్రకారం ద్వివివాహం నేరమైనప్పటికీ, ముస్లిం వ్యక్తిగత చట్టంలో ఉన్న మినహాయింపు చట్టపరమైన అసమానతకు దారితీస్తోందని వాదించారు. 1937 ముస్లిం వ్యక్తిగత చట్టంలోని సెక్షన్–2 రాజ్యాంగ విరుద్ధమని, అది ముస్లిం మహిళలకు సమాన న్యాయ రక్షణను దూరం చేస్తోందని పేర్కొన్నారు. ముస్లిం వివాహాలు, విడాకుల నమోదును తప్పనిసరి చేయాలని, రహస్య వివాహాలను అడ్డుకునే చర్యలు తీసుకోవాలని, బహుభార్యత్వం ఉన్న కుటుంబాల్లో మొదటి భార్య, పిల్లలకు వైవాహిక గృహ హక్కు, భరణం వంటి అంశాల పరిష్కారానికి వేగవంతమైన న్యాయ వ్యవస్థ ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు. బహుభార్యత్వం రాజ్యాంగంలోని 14, 15, 21 అధికరణాలకు విరుద్ధమని, మహిళల గౌరవం, సమానత్వాన్ని దెబ్బతీస్తోందని, అలాగే రాజ్యాంగంలోని 44వ అధికరణం సూచించే సమాన పౌర చట్టం (యూసీసీ) లక్ష్యానికి కూడా ఇది వ్యతిరేకమని పిటిషనర్లు పేర్కొన్నారు. ట్యునీషియా, టర్కీ వంటి పలు ముస్లిం దేశాలు ఇప్పటికే బహుభార్యత్వాన్ని రద్దు చేశాయని గుర్తు చేశారు.

# యుద్ధ విరమణకు హమాస్ గ్రీన్‌సిగ్నల్

- గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాలు వెనక్కి వెళ్తే నిరాయుధీకరణకు సిద్ధమని ప్రకటన
- భారీ ఆయుధాల అప్పగింతకు పాలస్తీనా రాష్ట్ర ఏర్పాటే షరతు
- ట్రంప్ శాంతి ప్రణాళిక అమలుపై ఉత్కంఠ.. ఇజ్రాయెల్ వైఖరిపై సందిగ్ధత

**కైరో:** గాజా యుద్ధాన్ని ముగించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. గాజాపై ఇజ్రాయెల్ సైనిక దాడులు పూర్తిగా నిలిపివేసి, తన బలగాలను ఉపసంహరించుకుంటే తాము నిరాయుధీకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని హమాస్ ప్రకటించింది. అయితే తమ వద్ద ఉన్న భారీ ఆయుధాలను పూర్తిగా అప్పగించే ప్రక్రియను స్వతంత్ర పాలస్తీనా రాష్ట్ర ఏర్పాటు దిశగా జరిగే రాజకీయ పరిణామాలతో ముడిపెట్టింది. ఈ ప్రతిపాదన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కాల్పుల విరమణ ప్రణాళికలో భాగంగా వెలుగులోకి వచ్చింది. అయినప్పటికీ ఒప్పందం అమలుపై ఇప్పటికీ అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### దశలవారీగా ఒప్పందం అమలు

ట్రంప్ ప్రకటించిన ప్రణాళిక ప్రకారం కాల్పుల విరమణ ఒప్పందాన్ని పలు దశల్లో అమలు చేయనున్నారు. హమాస్ నిరాయుధీకరణ పూర్తవుతున్న కొద్దీ ఇజ్రాయెల్ సేనలు గాజా నుంచి దశలవారీగా వెనక్కి వెళ్లాలి. అనంతరం అంతర్జాతీయ స్థిరీకరణ దళం, కొత్త పాలస్తీనా పోలీసు వ్యవస్థతో కలిసి గాజాలో శాంతి భద్రతల బాధ్యతలు చేపట్టనుంది. హమాస్ ఆధ్వర్యంలోని పోలీసు బలగాల వద్ద ఉన్న ఆయుధాలను అమెరికా మద్దతుతో ఏర్పాటు కానున్న నేషనల్ కమిటీ ఫర్ ది అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ గాజా అనే పాలస్తీనా సాంకేతిక కమిటీకి అప్పగించే ప్రతిపాదన కూడా ఒప్పందంలో ఉంది.

### అమలుపై ఇంకా అనిశ్చితే

ఈ ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రభుత్వం అధికారికంగా స్పందించలేదు. హమాస్ పూర్తిస్థాయిలో నిరాయుధీకరణ చేపట్టే వరకు గాజా నుంచి సేనలను ఉపసంహరించబోమని ఇజ్రాయెల్ ఇప్పటికే స్పష్టం చేసింది. అక్టోబర్‌లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై రాజకీయ ఒత్తిడి కూడా నెలకొనడంతో ఈ ఒప్పందం అమలు సులభం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా, టర్కీ, ఈజిప్ట్, ఖతార్ దేశాలు ఈ ఒప్పందానికి హామీదారులుగా వ్యవహరిస్తున్నాయి.

### నిరాయుధీకరణకు నెలల సమయం

హమాస్ భారీ ఆయుధాల స్వాధీనం, ఆయుధ తయారీ కేంద్రాల మూసివేత, భూగర్భ సొరంగాల నిర్వీర్యం వంటి ప్రక్రియ పూర్తవడానికి 200 నుంచి 350 రోజుల వరకు పట్టే అవకాశం ఉందని అమెరికా వర్గాలు తెలిపాయి. అయితే ఆయుధాలను ఇజ్రాయెల్‌కు కాకుండా పాలస్తీనా పరిపాలనా కమిటీ పర్యవేక్షణలో గాజాలోనే భద్రపరుస్తామని హమాస్ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రక్రియ కూడా ఇజ్రాయెల్ దశలవారీ సైనిక ఉపసంహరణతో అనుసంధానమై ఉంటుందని పేర్కొన్నాయి.

### యుద్ధం మిగిల్చిన విధ్వంసం

2023 అక్టోబర్ 7న హమాస్ దాడులతో ప్రారంభమైన ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌లో సుమారు 1,200 మంది మరణించగా, 251 మందిని బందీలుగా తీసుకెళ్లారు. అనంతరం ఇజ్రాయెల్ చేపట్టిన ప్రతిదాడుల్లో గాజాలో 73 వేల మందికిపైగా పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. యుద్ధంతో గాజాలోని సుమారు 60 శాతం ప్రాంతం తీవ్రంగా ధ్వంసమవగా, దాదాపు 20 లక్షల జనాభాలో ఎక్కువ మంది తాత్కాలిక శిబిరాలు, శిథిలమైన ప్రాంతాల్లో దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు.

# 14 ఏళ్ల తర్వాతే పాస్‌పోర్టు ఫీజుల పెంపు

- సేవల వ్యయం, నాణ్యత, ఆధునికీకరణను దృష్టిలో పెట్టుకునే నిర్ణయం
- 36పేజీల సాధారణ పాస్‌పోర్టు ఫీజు రూ.1,500 నుంచి రూ.2,500కు పెంపు
- లోక్‌సభలో కేంద్రం వెల్లడి

**న్యూఢిల్లీ:** పాస్‌పోర్టు సేవల నిర్వహణ వ్యయం, సేవల నాణ్యత మెరుగుదల, సాంకేతిక ఆధునికీకరణ, కార్యాచరణ అవసరాలను సమగ్రంగా సమీక్షించిన అనంతరమే పాస్‌పోర్టు ఫీజులను సవరించినట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల అమల్లోకి వచ్చిన 67 శాతం ఫీజుల పెంపు 14 ఏళ్ల విరామం తర్వాత తీసుకున్న నిర్ణయమని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. పాస్‌పోర్టు (సవరణ) నిబంధనలు–2026 ప్రకారం, 36 పేజీల సాధారణ కొత్త పాస్‌పోర్టు దరఖాస్తు ఫీజును రూ.1,500 నుంచి రూ.2,500కు పెంచారు. సవరించిన ఫీజులు ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి వచ్చాయని మంత్రి తెలిపారు. 2012లో చివరిసారిగా ఫీజులను సవరించిన తర్వాత 14 ఏళ్ల పాటు ఎలాంటి పెంపు చేపట్టలేదని వెల్లడించారు. గత పద్నాలుగేళ్లలో సేవల నిర్వహణ ఖర్చులు, సాంకేతిక వ్యయం, ఇతర ఇన్‌పుట్‌ల ధరలు గణనీయంగా పెరగడంతో ఫీజుల సవరణ అవసరమైందని కేంద్ర ప్రభుత్వం వివరించింది. పాస్‌పోర్టు సేవలను మరింత నాణ్యమైనవి, సురక్షితమైనవి, సమర్థవంతమైనవిగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన చర్యల వల్ల కూడా వ్యయం పెరిగిందని పేర్కొంది.

### ఈ–పాస్‌పోర్టు, పీఎస్‌పీ–2.0తో ఆధునిక సేవలు

అప్‌గ్రేడ్ చేసిన పాస్‌పోర్టు సేవా కార్యక్రమం (పీఎస్‌పీ) 2.0, ఈ–పాస్‌పోర్టుల అమలు ద్వారా సేవలు మరింత ఆధునికంగా, భద్రతతో కూడినవిగా మారాయని ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ మార్పుల కారణంగా సేవల నిర్వహణ వ్యయం కూడా పెరిగిందని వెల్లడించింది. ఇదిలాఉంటే పాస్‌పోర్టు ఫీజులను గతంలో 1971, 1980, 1993, 2002, 2012 సంవత్సరాల్లో సవరించగా, తాజా పెంపు 2026లో అమలులోకి వచ్చినట్లు కేంద్రం తెలిపింది. పాస్‌పోర్టు దరఖాస్తులకు నిర్దేశిత ఫీజు చెల్లించాల్సిన నిబంధన పాస్‌పోర్టు చట్టం–1967లోని సెక్షన్ 5(1), పాస్‌పోర్టు నిబంధనలు–1980లోని రూల్ 8 ప్రకారం అమల్లో ఉందని మంత్రి గుర్తుచేశారు.

# వాణిజ్య నౌకలపై దాడులు చేయొద్దు

- చర్చలు, దౌత్య మార్గాలకే భారత్ మద్దతు
- ప్రాంతీయ ఉద్రిక్తతలపై ఆందోళన
- ఏ పక్షం దాడి చేసినా ఖండిస్తాం
- ఇరాన్ విదేశాంగ మంత్రితో ఫోన్ కాల్‌లో ఎస్. జైశంకర్

**న్యూఢిల్లీ :** వాణిజ్య నౌకలు, నౌకా సిబ్బందిపై ఎలాంటి పరిస్థితుల్లోనూ దాడులు చేయొద్దని ఇరాన్‌కు భారత్ స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీతో శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. వాణిజ్య నౌకలపై జరిగే దాడులను ఏ పక్షం చేసినా భారత్ ఖండిస్తుందని తెలిపారు. ప్రాంతంలో కొనసాగుతున్న ఘర్షణలపై భారత్ తన తీవ్ర ఆందోళనను ఇరాన్ దృష్టికి తీసుకెళ్లిందని జైశంకర్ వెల్లడించారు. వాణిజ్య నౌకలు, వాటిలో పనిచేస్తున్న నావికుల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. ప్రస్తుత పరిణామాలపై ఇరాన్ వైఖరిని



కూడా అరాఘ్చీ నుంచి తెలుసుకున్నామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి చర్చలు, దౌత్య మార్గాలకే భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని జైశంకర్ స్పష్టం చేశారు. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇరుదేశాల విదేశాంగ మంత్రుల మధ్య ఈ సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది.

### హార్ముజ్ జలసంధిపై నిఘా

పర్షియన్ గల్ఫ్, హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులపై భారత్ ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మార్గం ద్వారా ప్రపంచ ఇంధన సరఫరాలో కీలక భాగం జరుగుతుండటంతో సముద్ర రవాణా భద్రతపై భారత్ దృష్టి సారించింది. మధ్యప్రాచ్యంలో 2026 నుంచి కొనసాగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకు 16 మంది భారతీయులు మృతి చెందినట్లు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గురువారం రాజ్యసభలో వెల్లడించారు. వీరిలో 10 మంది నౌకా సిబ్బంది ఉన్నారని తెలిపారు. మరో 75 మంది భారతీయులు గాయపడినట్లు చెప్పారు. మృతుల్లో సౌదీ అరేబియాలో ఒకరు, కువైట్‌లో ఇద్దరు, ఒమన్‌లో ఎనిమిది మంది, ఇరాక్‌లో ఒకరు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నలుగురు ఉన్నారని వివరించారు. గాయపడిన వారిలో యూఏఈలో 32 మంది, ఒమన్‌లో 24 మంది, ఖతార్‌లో నలుగురు, కువైట్‌లో 13 మంది, సౌదీలో ఒకరు, ఇజ్రాయెల్‌లో ఒకరు ఉన్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, ఖతార్‌లోని రాస్ లఫాన్ గ్యాస్ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మరో 12 మంది భారతీయులు మృతి చెందారని, ఈ ఘటన దాడులకు సంబంధం లేనిదని మంత్రి పేర్కొన్నారు.

# రష్యా సైన్యంలో 24మంది భారతీయులు

**న్యూఢిల్లీ:** రష్యా సైన్యంలో ఇంకా దాదాపు 24 మంది భారతీయులు పనిచేస్తున్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. వారిని విడుదల చేయించేందు కు రష్యా అధికారులతో సంప్రదింపులు కొనసాగు తున్నాయని తెలిపింది. రష్యా సైనిక విభాగాల్లో సహాయక సిబ్బంది (వంటవారు, సహాయకులు తదితరులు)గా చేరిన భారతీయులందరినీ తిరిగి పంపించాలని భారత్ ఇప్పటికే పలుమార్లు రష్యాను కోరినట్లు పేర్కొంది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, రష్యా సైన్యంలో ఉన్న భారతీయుల విడుదల అంశాన్ని ఆ దేశంతో నిరంతరం చర్చిస్తు న్నామని తెలిపారు. భారత ప్రభుత్వ ప్రయత్నాల ఫలితంగా ఇప్పటివరకు 139 మంది భారతీయు లను రష్యా సైన్యం నుంచి విడుదల చేయించినట్లు వెల్లడించారు. రష్యా సైన్యంలో చేరేలా ప్రలోభపెట్టే ఉద్యోగ అవకాశాల విషయంలో భారతీయులు అప్రమత్తంగా ఉండాలని జైస్వాల్ సూచించారు. కొందరు మోసపూరిత వ్యక్తులు, సంస్థలు ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో ప్రమాదకర అవకాశాలను చూపిస్తున్నాయని, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని హెచ్చరిం చారు. రష్యా సైన్యంలో ఇంకా కొనసాగుతున్న దాదాపు రెండు డజన్ల మంది భారతీయుల సురక్షిత విడుదల కోసం చర్చలు కొనసాగు తున్నాయని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

# బల్గేరియాలో అమెరికా సైనిక విమానాల మోహరింపు

- మధ్యప్రాచ్య ఆపరేషన్లకు మద్దతుగా బెజ్‌మర్ ఎయిర్‌బేస్‌కు చేరిన తొలి రెండు కేసీ–135 విమానాలు
- యుద్ధ దాడులకు తమ భూభాగం వినియోగించబోమన్న బల్గేరియా

సోఫియా: మధ్యప్రాచ్యంలో అమెరికా చేపడుతున్న సైనిక ఆపరేషన్లకు మద్దతుగా తొలి రెండు కేసీ–135 వైమానిక ఇంధన నింపే (ఎయిర్–టు–ఎయిర్ రీఫ్యూయలింగ్) విమానాలు శుక్రవారం బల్గేరియాలోని బెజ్‌మర్ వైమానిక స్థావరానికి చేరుకున్నాయి. ఈ మోహరింపుపై ఇరాన్ అభ్యంతరం వ్యక్తం చేయగా, బల్గేరియాలోని స్థానిక ప్రజలు కూడా నిరసనలకు దిగారు. నాటో, యూరోపియన్ యూనియన్ సభ్యదేశమైన బల్గేరియా పార్లమెంట్ ఈ నెల ప్రారంభంలో అమెరికాకు గరిష్ఠంగా ఎనిమిది కేసీ–135 విమానాలు, 250 మంది సైనిక సిబ్బంది, ఆయుధాలు, వైమానిక పరికరాలను బెజ్‌మర్ ఎయిర్‌బేస్‌లో మోహరించేందుకు అనుమతి ఇచ్చింది. అమెరికా రాయబార కార్యాలయం చేసిన విజ్ఞప్తి మేరకు ఈ అనుమతి 2026 అక్టోబర్ 1 వరకు అమల్లో ఉండనుంది.

### ఇరాన్‌కు బల్గేరియా హామీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ మోహరింపునకు అనుమతి ఇచ్చినందుకు బల్గేరియా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే బల్గేరియా విదేశాంగ మంత్రి వెలిస్లావా పెట్రోవా, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చితో ఫోన్‌లో మాట్లాడి, ఈ చర్యతో ఇరాన్ పట్ల తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. మధ్యప్రాచ్య ఘర్షణలకు సంబంధించిన ప్రత్యక్ష సైనిక దాడులు బల్గేరియా భూభాగం నుంచి నిర్వహించబోమని హామీ ఇచ్చారు.

### స్థానికుల నిరసనలు

బెజ్‌మర్ గ్రామం, పరిసర ప్రాంతాల ప్రజలు అమెరికా సైనిక విమానాల మోహరింపును వ్యతిరేకిస్తూ శాంతియుత ఆందోళనలు చేపట్టారు. దీనిపై స్పందించిన ప్రభుత్వ ప్రతినిధులు ప్రజలతో సమావేశమై, ఈ విమానాలు బల్గేరియా గగనతలం వెలుపల జరిగే విమానాలకు గాల్లోనే ఇంధనం నింపే లాజిస్టిక్ కార్యకలాపాలకే పరిమితమని వివరించారు. దేశ భూభాగం నుంచి ఎలాంటి యుద్ధ దాడులు జరగవని స్పష్టం చేస్తూ ప్రజలకు భరోసా కల్పించారు.

# స్కూళ్లు, కాలేజీల వద్ద జంక్‌ఫుడ్‌కు చెక్

**మంగళూరు:** విద్యార్థుల్లో ఆరోగ్యకర ఆహారపు అలవాట్లను ప్రోత్సహించేందుకు కర్ణాటక ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లోనే కాకుండా వాటి చుట్టూ 50 మీటర్ల పరిధిలో అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు (హెచ్ఎఫ్ఎస్ఎస్) కలిగిన ఆహార పదార్థాల విక్రయాన్ని నిషేధించింది. భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆహార భద్రత, ఔషధ పరిపాలన శాఖ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో 134 పాఠశాలలు, కళాశాలలు, వాటి పరిసరాల్లోని ఆహార విక్రయ కేంద్రాలను పరిశీలించారు. కొన్ని చోట్ల విద్యార్థులకు వైట్ బ్రెడ్, పాస్తా, ప్రాసెస్డ్ స్నాక్స్ వంటి అనారోగ్యకర ఆహారం అందిస్తున్నట్లు గుర్తించారు.

# ఒంటెను ఢీకొట్టిన ఆర్మీ వాహనం

- మేజర్ మృతి, ఇద్దరు లెఫ్టినెంట్లకు గాయాలు

**జైసల్మేర్:** రాజస్థాన్‌లోని జైసల్మేర్ సమీపంలో ఆర్మీ అధికారుల ఎస్‌యూవీ వాహనం ఒంటెను ఢీకొని పల్టీలు కొట్టడంతో ఓ ఆర్మీ మేజర్ మృతి చెందగా, మరో ఇద్దరు అధికారులు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి థయ్యాత్ ఆర్మీ ప్రాంతం వద్ద, జైసల్మేర్ నగరానికి సుమారు 18 కిలోమీటర్ల దూరంలో చోటుచేసుకుంది. ఆర్మీ స్టేషన్‌కు తిరిగి వెళ్తున్న సమయంలో మేజర్ హమ్జా అరిఫ్ (26) నడుపుతున్న ఎస్‌యూవీ ఎదుటకు అకస్మాత్తుగా ఒంటె రావడంతో వాహనం దానిని ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో వాహనం నాలుగు నుంచి ఐదు సార్లు పల్టీలు కొడుతూ దాదాపు 100 మీటర్ల దూరం వెళ్లి ఆగిపోయిందని పోలీసులు తెలిపారు.



### నెల క్రితమే వివాహం

ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని ఆర్మీ ఆస్పత్రికి తరలించగా, మేజర్ హమ్జా అరిఫ్ మృతి చెందినట్లుగా వైద్యులు ప్రకటించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆయనకు నెల రోజుల క్రితమే వివాహం జరిగినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన లెఫ్టినెంట్లు ఆయుష్మాన్, అభినవ్ రాథోడ్ ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



# బుమ్రా ఫిట్

- బీసీసీఐ ఫిట్‌నెస్ పరీక్షలో పాస్
- లంకతో టెస్టులకు సిద్ధమైన టీమిండియా పేస్‌గుర్రం
- రెండు టెస్టుల్లోనూ ఆడే అవకాశం
- డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలకు కీలకమైన సిరీస్

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టుకు భారీ ఊరటనిచ్చే వార్త అందింది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా పూర్తిగా కోలుకుని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యాడు. దీంతో వచ్చే నెలలో శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో అతడి ఎంపికకు మార్గం సుగమమైంది. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా బుమ్రా గాయానికి గురైన విషయం తెలిసిందే. అనంతరం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం పూర్తి చేసిన బుమ్రా, నిర్దేశించిన అన్ని ఫిట్‌నెస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. ఈ సందర్భంగా బీసీసీఐకి చెందిన ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ.. బుమ్రా పూర్తిగా కోలుకున్నాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్దేశించిన అన్ని ఫిట్‌నెస్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశాడు. జట్టు ప్రణాళికల్లో అతడు అత్యంత కీలక ఆటగాడు. శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల్లోనూ బుమ్రా అతడు బరిలోకి దిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి అని తెలిపారు.

భారత్–శ్రీలంక మధ్య ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్టు, ఆగస్టు 23 నుంచి కొలంబోలో రెండో టెస్టు జరగనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే భారత్ మిగిలిన తొమ్మిది టెస్టుల్లో కనీసం ఏడు విజయాలు సాధించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శ్రీలంక సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకోవడం భారత జట్టుకు అత్యంత కీలకంగా మారింది. అనంతరం న్యూజిలాండ్‌లో జరిగే క్లిష్టమైన టెస్టు సిరీస్‌కు ముందు ఈ విజయాలు జట్టుకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని అందించనున్నాయి.

### జట్టును వేధిస్తున్న గాయాలు

మరోవైపు గాయాలు భారత జట్టును వేధిస్తున్నాయి. హర్షిత్ రాణా హామ్‌స్ట్రింగ్ గాయం, నితీశ్ రెడ్డి క్వాడ్రిసెప్స్ గాయం కారణంగా ఇప్పటికే జట్టుకు దూరమయ్యారు. వాషింగ్టన్ సుందర్ హామ్‌స్ట్రింగ్ గాయంతో తొలి టెస్టుకు అందుబాటులో ఉండకపోగా, ఆకాష్ దీప్ వెన్నెముక గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. ఈ పరిస్థితుల్లో బుమ్రా తిరిగి జట్టులో చేరడం భారత బౌలింగ్ విభాగానికి పెద్ద బలంగా, జట్టుకు భారీ ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు.

# నీరజ్‌కు రజతం.. యశ్‌వీర్‌కు కాంస్యం

- జావెలిన్‌లో భారత్ ద్విపతక విజయం
- చివరి త్రోతో పోడియంపైకి యశ్‌వీర్



**గ్లాస్గో:** కామన్వెల్త్ క్రీడల పురుషుల జావెలిన్ త్రోలో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా రజత పతకాన్ని, యువ అథ్లెట్ యశ్‌వీర్ సింగ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. చల్లటి వాతావరణం, బలమైన గాలుల మధ్య జరిగిన పోటీలో నీరజ్ తన సీజన్‌లో అత్యుత్తమమైన 85.83 మీటర్ల త్రోతో రెండో స్థానంలో నిలిచాడు. శ్రీలంకకు చెందిన రుమేష్ తరంగ పతిరాజే 89.75 మీటర్ల త్రోతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకోగా, అరంగేట్ర కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొన్న యశ్‌వీర్ సింగ్ చివరి ప్రయత్నంలో వ్యక్తిగత అత్యుత్తమమైన 85.41 మీటర్ల త్రో విసిరి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. దీంతో జావెలిన్‌లో భారత్ రెండు పతకాలు దక్కించుకుంది. గత ఏడాది వెన్నునొప్పి గాయం కారణంగా చాలా కాలం పోటీలకు దూరమైన నీరజ్ ఈ సీజన్‌లో క్రమంగా లయను అందుకుంటున్నాడు. రజతంతో సరిపెట్టుకున్నప్పటికీ తన పునరాగమనం సంతృప్తికరంగా సాగుతోందని, ఆసియా క్రీడల నాటికి పూర్తి ఫిట్‌నెస్‌తో బరిలోకి దిగుతానని తెలిపాడు. అంతకుముందు డైమండ్ లీగ్‌లో పాల్గొని మరింత మెరుగైన ప్రదర్శన చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశాడు. మరో భారత అథ్లెట్ రోహిత్ యాదవ్ 81.56 మీటర్ల త్రోతో ఏడో స్థానంలో నిలిచాడు. ఈ పోటీలో స్వర్ణం శ్రీలంకకు, రజతం, కాంస్యం భారత్‌కు దక్కడంతో జావెలిన్ విభాగంలోని మూడు పతకాలు దక్షిణాసియా దేశాల ఖాతాలో చేరాయి.

# తైపీ ఓపెన్‌లో భారత షట్లర్ల జోరు

- సెమీస్‌కు దూసుకెళ్లిన హూడా, తన్వీ శర్మ

**తైపీ:** తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు ఉన్నతి హూడా, తన్వీ శర్మ మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీల్లో ఇద్దరూ ఆకట్టుకునే విజయాలు నమోదు చేసి చివరి నాలుగు దశలోకి దూసుకెళ్లారు. మూడో సీడ్‌గా బరిలోకి దిగిన ఉన్నతి హూడా, భారత క్రీడాకారిణి దేవికా సిహాగ్‌పై 23–21, 21–16తో వరుస గేమ్‌లలో విజయం సాధించింది. తొలి గేమ్‌లో 11–3తో భారీ ఆధిక్యంలోకి వెళ్లిన ఉన్నతిని దేవికా 21–21తో సమం చేసినా, కీలక సమయంలో వరుసగా రెండు పాయింట్లు సాధించిన ఉన్నతి గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ అదే జోరు కొనసాగించి 42 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించింది. మరో క్వార్టర్ ఫైనల్లో తన్వీ శర్మ థాయ్‌లాండ్‌కు చెందిన సుపనిడా కటెథాంగ్‌పై 21–15, 18–21, 21–14తో 54 నిమిషాలపాటు సాగిన ఉత్కంఠభరిత పోరులో విజయం సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది. అయితే పురుషుల సింగిల్స్‌లో భారత షట్లర్ కిరణ్ జార్జ్‌కు నిరాశ ఎదురైంది. జపాన్‌కు చెందిన నాలుగో సీడ్ యుదాయ్ ఒకిమోటో చేతిలో 12–21, 10–21తో కేవలం 33 నిమిషాల్లోనే ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు.




# రికార్డు అమ్మకాలు.. మారుతీకి లాభాల్లో బ్రేక్

- ముడి పదార్థాల వ్యయాల ప్రభావం.. 9.11 శాతం తగ్గిన నికర లాభం

**ముంబై:** దేశీయ అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) 2026–27 తొలి త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం 9.11 శాతం తగ్గి రూ.3,446.90 కోట్లకు చేరింది. ముడి పదార్థాల వ్యయాలు భారీగా పెరగడం లాభాలపై ప్రభావం చూపినట్లు కంపెనీ తెలిపింది. అయితే కార్యకలాపాల ఆదాయం 35.9 శాతం పెరిగి రూ.52,469.80 కోట్లకు చేరింది. త్రైమాసికంలో మొత్తం వ్యయాలు రూ.50,000.30 కోట్లకు పెరగగా, ముడి పదార్థాల వ్యయం రూ.32,013.20 కోట్లకు చేరింది. పశ్చిమ ఆసియా ఘర్షణల కారణంగా ముడి పదార్థాల ధరలు పెరగడం లాభాలను దెబ్బతీసిందని కంపెనీ పేర్కొంది. అయితే వాహనాల విక్రయాల్లో కంపెనీ కొత్త రికార్డు నెలకొల్పింది. తొలి త్రైమాసికంలో మొత్తం 6,82,724 వాహనాలు విక్రయించి 29.3 శాతం వృద్ధి సాధించింది. దేశీయ మార్కెట్ వాటా 41.2 శాతానికి చేరగా, ఎగుమతులు 28.6 శాతం పెరిగాయి. అలాగే తొలి దశలో నాలుగు కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలిపింది.

# 3 వారాల గరిష్ఠానికి సెన్సెక్స్, నిఫ్టీ

## మూడో రోజూ లాభాల్లో సూచీలు

- 8శాతానికి పైగా ఎగిసిన బజాజ్ ఫైనాన్స్ షేరు
- విదేశీ పెట్టుబడుల ప్రవాహం, కార్పొరేట్ ఫలితాలతో మార్కెట్లకు ఊతం



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా లాభాలతో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్ షేర్లలో భారీ ర్యాలీ, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు, కంపెనీల మెరుగైన త్రైమాసిక ఫలితాల ప్రభావంతో సెన్సెక్స్, నిఫ్టీ మూడు వారాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 166.49 పాయింట్లు (0.21%) పెరిగి 78,094.64 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో ఒక దశలో 344.10 పాయింట్లు ఎగిసి 78,272.25ను తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 66.45 పాయింట్లు (0.27%) లాభపడి 24,383.60 వద్ద స్థిరపడింది. జూన్ త్రైమాసికంలో నికర లాభం 28శాతం పెరిగినట్లు ప్రకటించడంతో బజాజ్ ఫైనాన్స్ షేరు 8.11 శాతం ఎగిసింది. బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారత్ ఎలక్ట్రానిక్స్, టైటాన్ షేర్లు కూడా లాభపడ్డాయి. మరోవైపు టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ, ఎటర్నల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.

### ఎఫ్ఐఐల కొనుగోళ్లు.. ఐటీలో అమ్మకాలు

గురువారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.3,623.51 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయడం మార్కెట్లకు బలాన్నిచ్చింది. అయితే ఇటీవల భారీగా పెరిగిన ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ కనిపించడంతో ఐటీ సూచీ 1.39 శాతం క్షీణించింది. ఆటో, క్యాపిటల్ గూడ్స్, పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, టెలికాం రంగాల షేర్లు లాభాలను నమోదు చేశాయి. వారాంత ప్రాతిపదికన చూస్తే సెన్సెక్స్ 2,034.87 పాయింట్లు (2.67%), నిఫ్టీ 616.15 పాయింట్లు (2.59%) ఎగిశాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు కూడా లాభాల్లో ముగియగా, అమెరికా మార్కెట్లు బలమైన లాభాలతో ముగిశాయి.



# డిజిటల్ యాక్సెసిబిలిటీ ఆడిట్‌కు గడువు పెంపు

- అక్టోబర్ 31వరకు అవకాశం ఇచ్చిన సెబీ
- దివ్యాంగులకు అనుకూల డిజిటల్ సేవల అమలుకు మరింత సమయం

**న్యూఢిల్లీ:** డిజిటల్ యాక్సెసిబిలిటీ ఆడిట్లు పూర్తిచేసి, ప్లాట్‌ఫారమ్‌లలోని లోపాలను సరిదిద్దేందుకు నియంత్రిత సంస్థలకు ఇచ్చిన గడువును సెబీ ఈ ఏడాది అక్టోబర్ 31 వరకు పొడిగించింది. పరిశ్రమ వర్గాల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దివ్యాంగుల హక్కుల చట్టానికి అనుగుణంగా డిజిటల్ వేదికలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ చర్య లక్ష్యమని సెబీ పేర్కొంది. 2025లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, తన నియంత్రణలోని అన్ని సంస్థలు దివ్యాంగులకు సైతం సులభంగా వినియోగించగల డిజిటల్ సేవలను అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది.

# ఐటీసీకి లాభాల షాక్

- 15.6 శాతం తగ్గిన నికర లాభం • 48శాతం వ్యయాల పెరుగుదలే కారణం
- ఆదాయం పెరిగినా మార్జిన్లపై ఒత్తిడి • స్వల్ప నష్టాల్లో ముగిసిన షేరు



**ముంబై:** విభిన్న రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐటీసీ లిమిటెడ్ 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మిశ్రమ ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. ఆదాయంలో గణనీయమైన వృద్ధి నమోదైనప్పటికీ, వ్యయాలు భారీగా పెరగడంతో కంపెనీ ఏకీకృత నికర లాభం 15.6 శాతం తగ్గి రూ.4,508.79 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.5,343.41 కోట్లతో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదలగా నిలిచింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఉత్పత్తుల విక్రయాల ద్వారా కంపెనీ ఆదాయం 27.82 శాతం పెరిగి రూ.29,409.82 కోట్లకు చేరింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం 27.64 శాతం వృద్ధితో రూ.29,523.30 కోట్లుగా నమోదైంది. ఇతర ఆదాయాన్ని కలుపుకుని మొత్తం ఏకీకృత ఆదాయం రూ.30,179.01 కోట్లకు చేరి, వార్షిక ప్రాతిపదికన 26.74 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ త్రైమాసికంలో కంపెనీ మొత్తం వ్యయాలు ఏకంగా 48 శాతం పెరిగి రూ.24,809.95 కోట్లకు చేరాయి. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు, చమురు ఆధారిత ఉత్పత్తుల ధరలు పెరగడం, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడడం కార్యకలాపాలపై ప్రభావం చూపినట్లు ఐటీసీ వెల్లడించింది. ఈ కారణంగానే లాభదాయకతపై ఒత్తిడి ఏర్పడిందని పేర్కొంది.

### కొనసాగుతున్న సవాళ్లు

గ్రామీణ, పట్టణ మార్కెట్లలో వినియోగదారుల డిమాండ్ స్థిరంగా కొనసాగుతున్నప్పటికీ, దిగుమతుల ఆధారిత ద్రవ్యోల్బణం, రుతుపవనాల లోటు, ఖరీఫ్ సాగు తగ్గుదల, ఎల్‌నినో ప్రభావం వంటి అంశాలు సమీప భవిష్యత్తులో సవాళ్లుగా మారే అవకాశముందని కంపెనీ అభిప్రాయపడింది. అయితే కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పెట్టుబడుల ప్రోత్సాహక చర్యలు, స్థిరమైన ద్రవ్య విధానం, రుణాల వృద్ధికి అందుతున్న మద్దతు భారత ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని ఆశాభావం వ్యక్తం చేసింది. త్రైమాసిక ఫలితాల ప్రభావంతో శుక్రవారం బీఎస్ఈలో ఐటీసీ షేరు 1.51 శాతం క్షీణించి రూ.280.95 వద్ద ముగిసింది. కంపెనీ లాభాల్లో తగ్గుదల నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

# నకిలీ నోట్లపై ఆర్‌బీఐ ఉక్కుపాదం

- సరిహద్దు జిల్లాల బ్యాంకుల్లో తప్పనిసరిగా నోట్ల గుర్తింపు యంత్రాలు ఉండాలని ఆదేశం

**ముంబై:** నకిలీ భారతీయ కరెన్సీ నోట్ల (ఎఫ్ఐసీఎన్) గుర్తింపులో కొన్ని బ్యాంకుల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని గుర్తించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. అంతర్జాతీయ సరిహద్దులు ఉన్న జిల్లాల్లోని అన్ని బ్యాంకు శాఖల్లో నోట్ల గుర్తింపు, వడపోత (నోట్ ఆథెంటికేషన్/సార్టింగ్) యంత్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో నకిలీ కరెన్సీ గుర్తింపు, నివేదికలు, పర్యవేక్షణపై సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసిన ఆర్‌బీఐ.. బ్యాంకులకు వచ్చే ప్రతి నోటును యంత్రాల ద్వారా తప్పనిసరిగా పరీక్షించాలని స్పష్టం చేసింది. నకిలీగా గుర్తించిన నోట్లను స్వాధీనం చేసుకుని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని తిరిగి వినియోగదారులకు ఇవ్వకూడదని, నాశనం చేయకూడదని ఆదేశించింది. గుర్తించిన ప్రతి నకిలీ నోటును నిర్దేశిత విధానంలో తప్పనిసరిగా నివేదించాలని పేర్కొంది.

### సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

నగదు నిర్వహణలో ఉన్న ప్రతి ఉద్యోగికి అసలు నోట్ల భద్రతా లక్షణాలు, నకిలీ నోట్లను గుర్తించే విధానంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఈ శిక్షణను అక్టోబర్ 31, 2026 నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అలాగే బ్యాంకుల్లోని ఫోర్జ్డ్ నోట్ విజిలెన్స్ (ఎఫ్ఎన్‌వీ) విభాగాలు నకిలీ కరెన్సీ డేటాను విశ్లేషించి, ఎక్కువగా గుర్తిస్తున్న ప్రాంతాలను గుర్తించి తదనుగుణంగా అవగాహన, సామర్థ్య పెంపు కార్యక్రమాలు చేపట్టాలని సూచించింది.



# లాభాల్లో బజాజ్ ఫిన్‌సర్వ్

- 18శాతం వృద్ధితో 6శాతానికి ఎగిసిన షేరు
- మార్కెట్ విలువకు రూ.19,263 కోట్లు అదనం

**ముంబై:** జూన్ త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం 18శాతం పెరగడంతో బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు శుక్రవారం 6 శాతానికి పైగా ఎగిశాయి. బీఎస్ఈలో షేరు 6.30 శాతం లాభంతో రూ.2,029.40 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈలో 6.26 శాతం పెరిగి రూ.2,029.10 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.19,262.62 కోట్లు పెరిగి రూ.3,24,815.61 కోట్లకు చేరుకుంది. జూన్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.5,329 కోట్ల నుంచి రూ.6,297 కోట్లకు పెరగగా, మొత్తం ఆదాయం రూ.35,300 కోట్ల నుంచి రూ.42,037 కోట్లకు చేరింది.

# బ్రహ్మ ముహూర్తంలో రామాయణ ట్రైలర్





రాముడిగా రణబీర్ కపూర్



రావణుడిగా యష్

ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటి ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపించింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణబీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతాయుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మ ణ రేఖ సందర్భంలో డా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకు రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు డా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం డా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణబీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మ ణుడిగా రవీ దూబే డా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మ ణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ–రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యే కంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపం చ ప్రఖ్యాత సంగీత దర్శకు డు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది. విజువల్స్‌కు తగ్గట్టుగా వినిపించిన సంగీతం.. ప్రతి సన్నివేశానికి వీక్షకులు లీనమయ్యేలా ఉంది. 'రామాయణ' ట్రైలర్ వలం ఓ సినిమా ప్రమోషన్‌లా కాకుండా భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించే మహత్తర సినీ ప్రయాణానికి నాందిగా నిలిచింది. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌లో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి రూ.4000 కోట్ల బ్జడెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. రామానంద్ సాగర్ ఆవిష్కరించిన ధారావాహికలో రాముడిగా కనువిందు చేసిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడిగా నటిస్తున్నారు. సీబా చద్దా.. మంథర పాత్ర పోషిస్తుండగా, శిశిర్ శర్మ వశిష్ఠ మహర్షిగా, అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా చేస్తున్నారు.



సీతగా సాయిపల్లవి



శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్

# 17 ఏళ్ల సినీ ప్రయాణం.. ఎన్నో పాఠాలు నేర్పింది

నటి శ్రుతిహాసన్ తనదైన వ్యక్తిత్వం, బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ ఇమేజ్‌తో సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. తనకు నచ్చిన విషయాలను నిర్భయంగా వ్యక్తం చేయడంలోనూ, తన ఆలోచనలను స్పష్టంగా చెప్పడంలోనూ ఆమెకు ప్రత్యేక శైలి ఉంది. సకల కళావల్లభుడు కమల్ హాసన్ వారసురాలిగా సినీ రంగంలో అడుగుపెట్టిన శ్రుతి, నటిగా మాత్రమే కాకుండా గాయనీగా, సంగీత దర్శకురాలిగానూ తన ప్రతిభను చాటుకుంటున్నారు. 2009లో విడుదలైన హిందీ చిత్రం 'లక్' ద్వారా కథానాయికగా పరిచయమైన శ్రుతిహాసన్, ఆ తర్వాత తెలుగు, తమిళ చిత్రసీమల్లో విజయవంతమైన నటిగా నిలిచారు. ప్రస్తుతం విజయ్ సేతుపతి సరసన నటించిన తమిళ చిత్రం 'ట్రైన్' విడుదలకు సిద్ధమవుతోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన 17 ఏళ్ల సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్న శ్రుతిహాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రయాణం తన గురించి, తన వృత్తి గురించి, మనుషుల గురించి ఎన్నో విషయాలు నేర్పిందన్నారు. ఒక సినిమా విజయం లేదా అపజయం కంటే, దాని వెనుక పనిచేసే పెద్ద బృందం సమష్టి కృషే అత్యంత ముఖ్యమనే విషయాన్ని ఈ ప్రయాణం తనకు అర్థమయ్యేలా చేసిందని చెప్పారు. ఈ 17 ఏళ్ల అనుభవం తనకు ఎన్నో పాఠాలు నేర్పిందని, అంతకంటే ముఖ్యంగా మానసికంగా మరింత దృఢంగా మార్చిందని శ్రుతిహాసన్ పేర్కొన్నారు. విమర్శలు, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే పరిపక్వతను ఈ సినీ ప్రయాణమే తనకు అందించిందని ఆమె తెలిపారు.



# సాయి పల్లవిపై రకుల్ పైచేయి?

ఇండియన్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'రామాయణ' చిత్రం ట్రైలర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో హాలీవుడ్ స్థాయి విజువల్స్, వీఎఫ్ఎక్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రావణాసురుడి పాత్రలో యష్ రాయల్ అండ్ కమాండింగ్ లుక్‌తో ట్రైలర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచాడని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. శ్రీరాముడి పాత్రలో రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి తమ పాత్రలకు న్యాయం చేసినప్పటికీ, యష్ స్క్రీన్ ప్రెజెన్స్ ముందు రణబీర్ పాత్రలో కనిపించాల్సిన దివ్యమైన ఆరా కొంత మేర తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సీత పాత్రలో సాయి పల్లవి లుక్ ఆకట్టుకున్నప్పటికీ, సినిమాలో ఆమె పాత్రకు ఎంత ప్రాధాన్యం ఉంటుందన్న అంశంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇక శూర్పణఖ పాత్రలో కనిపించిన రకుల్ ప్రీత్ సింగ్ ట్రైలర్‌లో ప్రత్యేకంగా మెప్పించిందనే చర్చ సాగుతోంది. గ్లామర్‌తో పాటు పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆమె పాత్ర ఆసక్తికరంగా ఉండబోతుందనే సంకేతాలు ట్రైలర్‌లో కనిపించాయని, కొందరి అభిప్రాయం ప్రకారం సాయి పల్లవి కంటే రకుల్ ఈ ట్రైలర్‌లో ఎక్కువ ప్రభావం చూపిందని సోషల్ మీడియాలో కామెంట్లు వినిపిస్తున్నాయి. అయితే విజువల్‌గా అద్భుతంగా కనిపించిన ఈ ట్రైలర్‌లో 'రామాయణం'కు ఉండాల్సిన ఆత్మ, బలమైన సంభాషణలు, భావోద్వేగ అనుబంధం కొంత మేర లోపించాయని పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ట్రైలర్‌తో సాంకేతికంగా ఆకట్టుకున్న ఈ చిత్రం, విడుదల అనంతరం భావోద్వేగ పరంగా ప్రేక్షకులను ఎంత మేరకు మెప్పిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# మరో లవ్ గ్రాక్ చిత్రం శ్రీనివాస మంగాపురం



ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ తురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యావ్, బ్రహ్మాజీ వంటి హేమా హేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యావ్) గారాల తురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీ పతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి డా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపో తుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిల్సాషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ప్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ముఖ్యంగా జయకృష్ణ ఎమోషనల్ సన్నివేశాల్లో మంచి పరిణతి చూపించాడు. డాన్సులు, యాక్షన్ సీక్వెన్స్‌లలోనూ ఆకట్టుకున్నాడు. రాషా తడాని డా తన అందం, అభినయంతో తొలి చిత్రం తోనే మంచి మార్కులు కొట్టేసింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమా హైలైట్‌గా నిలిచింది. మోహన్ బాబు తన సీనియారిటీతో, పవర్ ఫుల్ ఇంటెన్సిటీతో పాత్రకు పూర్తి వన్యాయం చేశారు. కిక్ శ్యావ్, అజయ్ తమ విలనిజంతో సినిమాను నిలబెట్టగా.. బ్రహ్మాజీ, నరేష్‌ల కామెడీ అక్కడక్కడా నవ్విస్తుంది. దర్శకుడు అజయ్ భూపతి ఎంచుకున్న లవ్ అండ్ ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్ బాగుంది. సంగీత దర్శకుడు జీవి ప్రకాష్ కుమార్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా స్థాయిని పెంచాయి. ముఖ్యంగా స్క్రీన్ పై పాటలు మరింత రిచ్‌గా కనిపిస్తాయి.

# దీపావళి బరికోసం సూర్య 47 సిద్ధం



తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటి వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటి 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలల 'సూర్య47' డా థియేటర్లలోకి వస్తే, ఓ ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' డా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.